కథ నిలయం
SA
43075

హ్యాపీబర్త్‌డే

(2009 ఆగస్టు 16నుంచి
2009 ఆగస్టు 22 వరకు)

వై. సంపత్‌కుమార్
7సం॥, ఆగస్టు-19
సుజాత-రత్నం
రామరాజుపల్లె-కడప

జి.గుణ
4సం॥,ఆగస్టు-20
రాధిక-వెంకటాద్రి
వైరా-ఖమ్మం

లహరి
4సం॥,ఆగస్టు-2005
అఖిల-అనీల్‌కుమార్
బెంగుళూరు-కర్నాటక

టి.ఎస్.శివభార్గవి
ఆగస్టు-20
లక్ష్మీకళ్యాణి-రాజశేఖర్
కమ్మబంటుపల్లి-శ్రీకాకుళం

బి. ఆకాష్
4సం॥,ఆగస్టు-18
భారతి-అప్పలనాయుడు
పాలకొండ-శ్రీకాకుళం

కుపేక్షిత(బన్ని)
9సం॥,ఆగస్టు-2000
రాజ్యలక్ష్మి-శ్రీనివాస్
కసాబ్‌గల్లి-నిజామాబాద్

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశపడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1, ఎం.హెచ్ భవన్
ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email- venkateshcartoon@gmail.com

మనలో మాట

గడ్డే బంగారమాయెనా!

'ఇప్పుడే వాడికింత 'గడ్డి' పెట్టి పంపాను. ఈ దెబ్బతో మారి తీరతాడు.' అని అథార్టీ ఉన్న పెద్ద మనుషులు అప్పుడప్పుడు అంటూ ఉంటారు. పెడమార్గం పట్టినవాణ్ణో, పెడసరితనం పెరిగినవాణ్ణో సరి దారిలో పెట్టటానికి ఇన్ని అక్షింతలో, చీవాట్లో పెట్టటం ఈ 'గడ్డి'కి ఉన్న అర్థమని మనకు తెలుసు!

ఇప్పుడు తెలుసుకోవల్సిన విషయమేమిటంటే- ఇకపై ఇలా గడ్డి పెట్టి పంపామని చెప్పడం అంత ఆషామాషీ కాదు! ఎందుకంటే- గడ్డి ఓ అపురూప వస్తువైంది. ఇది గడ్డి మేసేవాళ్లు ఎక్కువవ్వడంవల్ల వచ్చిన కొరత కాదు సుమా! వానలు ముఖం చాటేయడంవల్ల వచ్చిన కరువు. ఇప్పుడు 'గడ్డి' అన్న మాటెత్తితే చాలు, ఆవురావురమని ఆవులూ, గేదెలూ అంగలార్చే పరిస్థితి! రాజావారి రాజ్యంలో ఓ ముప్పయ్యో, నలభయ్యో పెడితే కేజీ బియ్యం కొనుక్కోవచ్చు కానీ, ఎంత వెచ్చించినా మోపెడు గడ్డిని సంపాదించడం మాత్రం కష్టం!

ఇప్పుడెవరైనా 'అన్నం తింటున్నావా? గడ్డి తింటున్నావా?' అని ఆగ్రహించడం కూడా ఔట్ డేటెడ్డే అవుతుంది. గడ్డి కొరతవల్ల రాష్ట్రంలోని పశువుల సంతలు కోడెగిత్తలూ, పాడి ఆవులతో నిండిపోతున్నాయి. కరువు ధాటికి విలవిల్లాడుతున్న రైతు మూగజీవాలకు ఇంత గ్రాసం పెట్టలేక- వాటిని ఎంతకో కొంతకు తెగనమ్మాలనుకుంటున్నాడు.

దేవుడి రాజ్యంలో ఇలాంటి దుస్థితి తలెత్తటం విడ్డూరమే!

వరుణుడు కూడా ఏదైనా వికర్షక పథకానికి గురయ్యాడేమో?

ఆయన తమ పార్టీలోనే ఉన్నాడని నిన్నమొన్నటిదాకా చెయ్యెత్తి చెప్పినోళ్లకి ఇప్పుడు మాట పడిపోయింది. ఇక్కడ ఇంకోటి కూడా సెలవివ్వాలి : మనుషులైతే సన్నబియ్యం బదులు దొడ్డుబియ్యం తినాలి. కందిపప్పు బదులు శెనగపప్పు తినాలి. మరి గొడ్లు ఏ గడ్డి మాని ఏ గడ్డి తినాలి? మన మంత్రులు, ముఖ్యమంత్రి దీనికి మార్గాంతరం కనిపెట్టలేదు.

పశువులు మాటకేంకానీ, ఇలాంటి కరువు కాలంలో కొంతమంది పెద్దలు ఏ గడ్డయినా కరుస్తారు. దీనికి ఉదాహరణలు కోకొల్లలు. 'దాణా'ను ప్రసాదంగా తినేసిన లాలూ ఇలాంటి బాపతుకు గురుతుల్యుడిగా చెప్పుకోవొచ్చు. ఏతావాతా కరువు వచ్చిందటే- ఏలి'నోళ్లకు', వాళ్ల అను'మాయావులకు' పెద్ద మేత దొరికినట్టే! కరువులో మామూలు వర్షం కురవదు కానీ, కార్ల వర్షం కురుస్తుందని గతంలో ఓ ప్రసిద్ధ జర్నలిస్టు పసిగట్టాడు. ఇక ఈ కరువులో కార్లు కురుస్తాయో.. విమానాలు మొలుస్తాయో... చూడాలి!

జనగ్రాసం గురించే పట్టించుకోలేనివాళ్లు పశుగ్రాసం గురించి స్పందిస్తారనుకోవడం అత్యాశే! అయినా, ఈ సమస్యను గడ్డిపరకలా తీసిపారేయకూడదు. పశువులకు ఓట్లు లేకపోవొచ్చు; వాటిని ప్రాణంగా ప్రేమించే రైతులకు ఉన్నాయని మర్చిపోకూడదు.

★

ఈ సంచికలో....

టపా	...	2
నవ్వుల్ పువ్వుల్	...	3
తెల్సా	...	7
మొద్దామా	...	8
సీరియల్	...	10
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
రుచి	...	17
కవిత్వమ్	...	18
క్రైమ్ కథ	...	19
కథ	...	22
కొత్తపుస్తకాలు	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

ఆస్ఫూర్తే నన్ను నడిపిస్తోంది

జ్ఞాపకాలు ... 6

నా పల్లె మారిపోయింది



సమ్‌థింగ్ స్పెషల్ ...20

దినుసులు... ఊసులు



గుర్తుండిపోతుంది

నేస్తమా షుక్రియా వ్యాసం చాలా బాగుంది. తోడులేని జీవి జగత్తులో ఎక్కడా వుండదు. ఎన్నో సినిమాల్లో ఈ స్నేహబంధాన్ని చక్కగా చిత్రీకరింపబడింది. ఫ్రెండ్‌షిప్‌డే నిజంగా తరతరాలుగా గుర్తుండిపోతుంది. స్నేహమేరా జీవితం - స్నేహమేరా శాశ్వతం అనేది నిత్య సత్యం.

ఆచార్య నూతి నారాయణరావు,
గడ్డిఅన్నారం, హైదరాబాద్.

చక్కటి కిళ్లీ కబుర్లు

పండుటాకుల్లాంటి తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలు రేపు వారికీ అదే పరిస్థితి ఎదురవ్వదని గ్యారెంటీ వుందా? 'మీ ఇష్టమొచ్చినంత కిళ్లీ తినండి, కానీ ఎక్కడ పడితే అక్కడ ఊయకండి' అని చెప్పుతో కొట్టినట్టు మా బాగా చెప్పారు. తెల్సాలో తిమింగలం గురించి చదివి ఆశ్చర్యపోయాం. స్నేహమేరా జీవితం అంటూ చివరి అట్టమీద వేసిన చిత్రాలు బాగున్నాయి. ముప్పై కోట్లు వసూలు చేసిన 'నాదోడిగళ్' చిత్రాన్ని తప్పకుండా చూడాల్సిందే.

వాస్తు రామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.

సినిమా కబుర్లు బావున్నాయి

తమలపాకులంటే తెలియని వారు వుండరేమో. ఎంత రుచిగా వుంటాయో అంతే ఆరోగ్యాన్ని కూడా అందిస్తాయి ఈ తమలపాకులు. ఇక శుభకార్యాలకు, పెళ్లి పేరంటాలకు, పండుగలకు వీటిదే ప్రథమస్థానం. కానీ శుభ్రత కూడా ముఖ్యమే కదా. అభినయను చూస్తే ఎవ్వరికీ ఆమెకు మాటలురావు, వినిపించదు అని అనుకోరు. 'ఇంత చక్కని అమ్మాయికి మాటలు రావా' అనిపించింది. కానీ ఆమెకున్న లోపాన్ని అధిగమించి తనేమిటో తన నటన ద్వారా నిరూపించుకుంటుంది. సోదరీ సోదరుల మధ్య ప్రేమానురాగాల ప్రతీక రాఖీపౌర్ణమి. రాఖీ పండుగను ఏఏ రాష్ట్రాలలో ఏఏ పేర్లతో పిలుస్తారో తెలుసుకున్నాం. ఇంకా రాఖీల్లో ఇన్ని రకాలున్నాయని ఈ శీర్షిక చదివే వరకు మాకు తెలియలేదు. అనురాగాల నిండు పున్నమి అంటూ మాకు తెలియని ఎన్నో విషయాలు తెలిపినందుకు ధన్యవాదాలు.

పావని, కుసుమ, గుంటూరు.

తల్లిపాల విశిష్టత చెప్పినందుకు సంతోషం

స్నేహానికి మించిన బంధం లోకంలో మరేదీ లేదు. స్నేహితులను పొందడం కంటే ఆ స్నేహాన్ని నిలుపుకోవడం ఇంకా కష్టం. జీవితంలో ఏవేవో మనస్పర్థలు వస్తుంటాయి. కానీ వాటన్నింటిని వదిలేసి స్నేహ బంధాన్ని నిలుపుకొన్నవాళ్లే నిజమైన స్నేహితులు. సందర్భానుగుణంగా ఈ వారం నేస్తమా షుక్రియా ను అందించినందుకు మాకు చాలా సంతోషంగా వుంది. తల్లిపాలు బిడ్డకు ఎంత మంచిదో చెప్పినా కూడా ఈ కాలంలో కొందరికి అర్థం కాదు. లేనిపోని అపోహలతో చంటి పిల్లలకు తల్లిపాలు పట్టకుండా ఫ్యాషన్లకు పోతున్నారు. అలా కాకుండా సాధ్యమైనంత వరకు బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలి. తల్లి పాలవల్ల ఎటువంటి లాభాలు చేకూరతాయో ఆరోగ్యం శీర్షికలో చాలా చక్కగా వివరించారు.

ఎం. సాంబశివరావు, విశాఖ.

మనలోమాట చక్కగా చెప్పారు

మంచినీరివ్వలేరా? కవిత మాకు బాగా నచ్చింది. ఈ వారం వచ్చిన స్నేహ పుస్తకంలోని ప్రతి పేజీ మాకు చాలా నచ్చింది. అనురాగాల నిండుపున్నమి అంటూ రక్షా బంధన్ గురించి చాలా వివరంగా చెప్పారు. అలాగే స్నేహం గురించి వచ్చిన కవర్ స్టోరీ 'నేస్తమా షుక్రియా' బాగుంది. కథ, తమలపాకుల విశిష్టత గురించి చక్కగా వివరించారు. తండ్రి బిడ్డ గురించి ఎంతగా ఆవేదన చెందుతున్నాడో, ఆ బిడ్డ పెరిగి ఆ తండ్రినే మర్చిపోయి తన సుఖం తను చూసుకుంటున్నాడని, మనలోమాట ద్వారా నేడు జరుగుతున్న తంతు ఇదేనని చక్కగా చెప్పారు.

కె. పూర్ణిమ, ఆదిలాబాద్.

'పిల్లకాకి' ఆకట్టుకుంది

పిల్లకాకి కథ మా ఇంట్లో అందరినీ ఎంతగానో ఆకట్టుకుంది.

కొందరు భూస్వాముల అరాచకాలకు దళితులు ఎలా బలౌతున్నారో, వారి ప్రాణాలు ఎలా బలిగొంటున్నారో కథలో బాగా చెప్పారు. గని సీరియల్ ఆసక్తికరంగా సాగుతోంది. మనలోమాట బాగుంది. స్నేహానికి తేడాలు లేవని చివరిపేజీలో వివిధ రకాల జంతువుల మధ్య వున్న మైత్రిని ఫొటోలతో చక్కగా చూపించారు.

భాస్కర్.వి, కె.వి.పాలెం.

ఆలీబాబా అదిరింది

స్నేహానికి కులమతాలే కాదు, జాతి బేధాలు కూడా అడ్డురావనీ, వివిధ జంతువులు, పక్షుల మధ్య కూడా స్నేహం పెరుగుతుందని ఫొటోలలో చక్కగా వివరించారు. అలీబాబా 40 దొంగలు పునఃకథనం బాగుంది.

బి. ఉదయశంకర్, కాకుమాను.

★



నవ్వుల్ - పువ్వుల్

చిన్నప్పుడు...

(ఇద్దరు వృద్ధులు మాట్లాడుకుంటుంటారు)

మొదటి తాత : ఇప్పుడిలా వున్నాకానీ...నాకు చిన్నప్పుడు విపరీతమైన కోపం వచ్చేది తెల్సా!

రెండవ తాత : అవునా! దానికి నిదర్శనం?

మొదటి తాత : ఓసారి కోపం వచ్చి ఓ సింహం మెడ, ఎలుగుబంటి కాలు విరిచేశాను. అంతేకాదు! ఏనుగు దంతం పీకి పడేశాను.



రెండవ తాత : ఆ...భలే వుందే. నువ్వు నిజంగా చాలా ధైర్యవంతుడివి సుమా! ఆ తర్వాత ఏమైంది?

మొదటి తాత : పెద్దగా ఏం కాలా! ఆ బొమ్మల షాపు ఓనరు నన్ను బయటికి గెంటేశాడంతే...

టాక్

(ఇద్దరు మిత్రులు మాట్లాడుకుంటున్నారు)

మొదటివాడు : ఏరా! ఆ సినిమా ఎలా వుందంటే టాక్ బానే వుందన్నావ్. అలా ఏడ్చిందేంటి?

రెండోవాడు : ఆ సినిమా బాలేదన్న టాక్ బాగా వచ్చింది మరి.

అడ్రస్

సుబ్బారావ్: నేను రోడ్డు మీద భిక్షగాడికి దానం చేయను. వెళ్లుపో.

భిక్షగాడు: ఓస్ అదా మీ సమస్య. అయితే ఇంటి అడ్రస్ చెప్పండి సార్. అక్కడికొచ్చి తీసుకొంటాను.

చీమలంత

(రమేష్ మొదటిసారిగా విమానం ఎక్కాడు. అతను పక్క వ్యక్తితో మాట్లాడసాగాడు)

రమేష్ : విమానంలోంచి చూస్తే మనుషులంతా చీమల్లా కనిపిస్తున్నారుకదూ.

పక్క వ్యక్తి : అవి చీమలేనండీ. విమానం ఇంకా బయలుదేరలేదు!

కళ్లజోడు

రాము : అమ్మా! పక్షులకు కళ్లు బాగా పని చేస్తాయనుకుంటా?

తల్లి : అలా ఎందుకనుకుంటున్నావ్?

రాము : మరి వాటికి కళ్లజోళ్లు లేవుకదా.

హార్మోనియం

కుమారుడు : నాన్నా! నాకు హార్మోనియం పెట్టె కొనిపెట్టవూ!

తండ్రి : తప్పకుండా కొనిపెడతా. కాకపోతే ఒక షరతు. నువ్వు పొద్దస్తమానం దాన్ని మోగించి నన్ను విసిగించకూడదు.

కుమారుడు : ఓకే నాన్నా. నువ్వు నిద్రపోయేటప్పుడు మాత్రమే దాన్ని వాయిస్తాను.

ఫ్రీ

కస్టమర్ : ఏమయ్యా! నేను టీ మాత్రమే ఆర్డరిచ్చాను. దానితో పాటు ఈగను కూడా కాదు.

వెయిటర్ : దానికి బిల్లు వేయం సార్! ఫ్రీ గానే ఇస్తాం. తాగేయండి.

-పర్సా సత్యనారాయణ,
సిపిఐ(యమ్) సీనియర్ నాయకులు.

ఆ స్ఫూర్తే నన్ను నడిపిస్తోంది

కొండలోపల పైకి మెట్లున్నాయి. పైగా ఏటవాలుగా వున్నాయి. అంతా హుషారుగా ఎక్కుతున్నారు. కొంత దూరం పోయాక నాకు అలుపొచ్చింది. గమ్యం చేరగలనా లేదా? అన్న శంక మొదలైంది. మరోవైపు శారీరక శ్రమ కూడదన్న డాక్టర్ సలహా గుర్తొచ్చింది. అవస్థగావుంది కాబట్టి వెనక్కి వెళ్దామా? అంటే చేరాల్సిన గమ్యం చేరకుండా వెనక్కి వెళ్లడమేంటి? తోటివారి దృష్టిలో గమ్యం చేరలేక వెనక్కి వెళ్లినట్టవుతుందికదా! అనిపించి ధైర్యం చేసి ముందుకే అడుగులు వేశాను. ఆ గమ్యమే నన్ను ముందుకు నడిపించింది. ఆ క్షణంలో నాకు 'జీవనసమరం' హీరో అలెక్సీ గుర్తురాలేదు. కానీ అతనిచ్చిన స్ఫూర్తి నాలో నిండుగా వుంది. 1947 నుంచి 98 వరకు ఎన్నో ఆటంకాలను, సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు నడిచాను. కానీ అవి వేరు. ఇది వేరు. వాటిలో పోలీసుల కంట పడకుండా గమ్యం చేరడం ఎలా? వారి నుంచి తప్పించుకోవడం ఎలా? వంటి ఆలోచనలు వుండేవి. ఇది అలా కాదే! శారీరక సమస్య. ఇదేకాదు. ప్రతిసారీ అదే స్ఫూర్తితో ప్రజాఉద్యమంలో ముందుకు నడిచాను. నడుస్తున్నాను. ఎన్ని అవాంతరాలొచ్చినా అధిగమించి ముందుకు సాగాలన్న స్ఫూర్తే నన్ను ఇప్పటిదాకా నడిపిస్తోంది.

నేను ప్రజాఉద్యమంలోకి రావడానికి స్ఫూర్తినిచ్చిన తొలి పుస్తకం 'మాలపల్లి' అయితే రెండవది 'జీవనసమరం'. ఇవి రెండూ నవలలే కావడం విశేషం. మొదటి పుస్తకం 1944లో సంగీత దర్శకులు టి. చలపతిరావు ద్వారా నాకు అందింది. ఆయన అప్పట్లో నా సహోద్యోగి. ఇద్దరం కలిసి సింగరేణిలో పనిచేశాం. ఇక రెండవపుస్తకం నా చేతికి వచ్చిన విధానాన్ని ఒక్క ముక్కలో చెప్పలేను. 1950వ సంవత్సరంలో చంచల్‌గూడ జైల్లో వున్నాను. మమ్మల్ని చూడ్డానికి వచ్చిన కామ్రేడ్లు సోవియట్ సాహిత్యం తీసుకొచ్చి పడేసేవారు. అలా వచ్చిన పుస్తకాల్లో 'జీవన సమరం' (ఎ స్టోరీ ఆఫ్ ఎ 'రియల్ మేన్') నవల ఒకటి. రెండవ ప్రపంచ యుద్ధ కాలంనాటి ఓ పైలెట్ నిజజీవితగాథ ఆధారంగా బోరిస్ పొలవాయ్ రాసిన నవల ఇది. దీన్ని చదివేనాటికి నాకు 26 సంవత్సరాలుంటాయి. ట్రేడ్ యూనియన్ రంగంలో పని చేస్తూ అరెస్టయిన సమయంలో చదివాను. నాకు స్ఫూర్తినిచ్చిన మరో పుస్తకం సర్దార్ పృథ్వీసింగ్ జీవిత చరిత్ర. పృథ్వీసింగ్ ప్రఖ్యాత గదర్ వీరుడు. ఆయన జీవిత చరిత్రను 1944లోనో, 1945లోనో చదివాను. పృథ్వీసింగ్‌ను నిర్బంధించి కాళ్లకు, చేతులకు బేడీలు వేసి రాజమండ్రి జైలుకు రైల్లో తీసుకువెళ్తుండగా గొలుసులతోనే రైలునుంచి దూకుతాడు. ఆంధ్ర ప్రాంతంలో ఇది జరుగుతుంది. రైతుల సహకారంతో పంజాబ్‌కు చేరతాడు. అక్కడనుంచి రహస్యంగా ఆఫ్గనిస్తాన్ మీదగా సోవియట్‌లోకి అడుగుపెడతాడు. ఆ సమయంలో ఆయన పొందిన అనభూతే నేను ఔరంగాబాద్ జైలు నుంచి తప్పించుకున్నప్పుడు కలిగింది.

ఇక 'జీవనసమరం' కథలోకి వెళితే...కథానాయకుడు అలెక్సీ ఒక పైలెట్. అతనికో స్నేహితురాలుండేది. ఆమె నర్సు ఉద్యోగం చేస్తుండేది. ఇద్దరి మధ్యా ప్రేమ మొలకెత్తుతుంది. అది పెళ్లి దాకా వస్తుంది. సరిగ్గా ఆ సమయంలో రెండవ ప్రపంచ యుద్ధం వస్తుంది. ఆకాలంలో అన్ని దేశాల్లోనూ ఒక నిబంధన వుండేది. దాన్ని తప్పక పాటించాలికూడా. శారీరకంగా దృఢంగా వున్న వారంతా తప్పనిసరిగా సైన్యంలో చేరాలి. అప్పటివరకు వారు చేస్తున్న ఉద్యోగాన్ని వదిలి దేశరక్షణకోసం పాటుపడాలి. ప్రభుత్వం వారిని కావాల్సిన విధంగా ఉపయోగించుకునేది. వృద్ధులు, అంగవికలాంగులు ఇందుకు మినహాయింపు.

దాంతో పైలెట్, నర్సు పెళ్లి వాయిదా పడుతుంది. ఇద్దరూ యుద్ధంలో రిక్రూట్ అవుతారు. జర్మనీ సైనికులు రష్యా సైనికుల విమానాలు పడగొట్టడం, రష్యా సైనికులు జర్మనీ సైనికుల విమానాలు పడగొట్టడం... భూమ్యాకాశాలలోనేకాక జలమార్గంలో కూడా హోరాహోరీగా యుద్ధం జరుగుతుంటుంది. ఈ సమయంలో అలెక్సీ నడిపే విమానాన్ని జర్మనీ సైనికులు కూలగొడతారు. అది ఓ చిక్కటి అడవిలో మహావృక్షంమీద పడిపోతుంది. అతను అక్కడినుంచి నేలమీద పడి స్పృహ కోల్పోతాడు. మెలకువ వచ్చి చూసుకుంటే అడవిలో వుంటాడు. కదలబోతే కాళ్లు సహకరించవు. దాంతో కాళ్లకు దెబ్బ తగిలిందని అతనికి అర్థమౌతుంది. పాకడం మొదలెడతాడు. కేకలేస్తాడు. ఎవ్వరూ రారు. మరోవైపు ఆకలి దహించివేస్తుంటుంది. దాహంతో

నోరు పిడచగట్టుకుపోతుంది. అలాగే పాకుతుండగా ... కొన్ని ఎలుగుబంట్లు వచ్చి పుట్టలో మూతిపెట్టి చెదల్ని పీల్చుకుని తినడం చూస్తాడు. అవి వెళ్లిపోయాక అతనుకూడా వాటిలాగే చెదపురుగుల్ని తింటాడు. అలా బతకడం కోసం జీవనపోరాటం చేస్తాడు. కొంత దూరం వెళ్లేసరికి గస్తీ తిరుగుతున్న సోవియట్ సైనికులు ఇతడ్ని చూసి క్యాంపుకు తీసుకెళ్తారు. విమానంలో ఆసుపత్రికి పంపి చికిత్స చేయిస్తారు. కాళ్లు రెండూ మోకాళ్ల కిందికి తీసేస్తారు. గాయాలు మానాక చెక్క కాళ్లు అమరుస్తారు.

అక్కడ అతనిలో ఓ ఆలోచన మొదలౌతుంది. యుద్ధం అయ్యాక నేను ఇంటికి వెళతాను. ఆ తర్వాత నేస్తం కూడా వస్తుంది. ఆమెను కలుసుకోవాలి. పెళ్లి చేసుకోవాలి. ఆమె ప్రేమకు పాత్రుడ్ని కావాలంటే నడవాలి. ఆమెతో కలిసి డాన్స్ చేయాలి. కుటుంబ జీవనానికి అనుకూలంగా తయారుకావాలి. మరి యుద్ధం ముగిసేలోపు ఏం చేయాలి? యుద్ధ విమానాన్ని నడపాలి. నా విమానాన్ని శత్రువు కూల్చాడు. శత్రువు విమానాన్ని నేను కూల్చాలి. కసి తీర్చుకోవాలి. అంటే.... మళ్లీ పైలెట్ కావాలి. ఆలోచనలోనే తనను ఆసుపత్రినుంచి డిశ్చార్జ్ చేయమంటాడు. వైద్యులేమో ఆరోగ్యం కుదుటపడాలికదా అంటారు. కావాలంటే పరీక్షచేసుకోమంటాడు. కారిడార్‌లో వేగంగా నడిచి, నృత్యం చేసి, పరుగెత్తి చూపిస్తాడు. తనను సైనిక కేంద్రానికి పంపమంటాడు. తీరా అక్కడికి వెళ్లాక సైనికాధికారులతో ఫైటింగ్ మొదలెడతాడు. తనను పైలెట్‌గా తిరిగి తీసుకోమంటాడు. యుద్ధవిమానం నడుపుతానంటాడు. వికలాంగులను పైలెట్‌గా తీసుకోవడానికి నిబంధనలు ఒప్పుకోవంటారు వారు. కావాలంటే విమానం ఇచ్చి పరీక్ష చేసుకోమంటాడు మొండిగా. 'పనికిరావు' అన్న దగ్గరల్లా 'నడుస్తాను, పరిగెడతాను, డాన్స్ చేస్తాను' అంటూ చూపించసాగాడు. ఇతని పోరు పడలేక మిలటరీ అధికారులు ట్రయల్ చూద్దామని చివరికి యుద్ధవిమానం ఇస్తారతనికి. వారు కిందనుంచి టీవీలో అతనిని గమనిస్తుంటారు. పాదాలు చేయవలసిన పనులను మోకాలి కింది ఎముకను గట్టిగా అదిమిపట్టి చేస్తుంటాడు. ఆ సమయంలో అతను పడే నరకయాతన అంతా ఇంతా కాదు. విమానాన్ని మొండిగా విజయవంతంగానే నడుపుతాడు. నేలమీదకు చేరాక మళ్లీ పోరు మొదలెడతాడు. శత్రుసైన్యంమీదకు దాడికి వెళతానంటాడు. ఎట్టకేలకు పంతం నెగ్గించుకుని రెండుమూడు శత్రు విమానాలను పడగొట్టి హీరోగా తిరిగొస్తాడు విజయగర్వంతో. యుద్ధం అయ్యాక సైన్యంలో పనిచేసేవారిని రిలీవ్ చేస్తారు. చివరకు నర్సు, పైలెట్ కలుసుకుంటారు.

ఈ నవల చదివిన తర్వాత చాలా సంవత్సరాలకు రామోజీరావు నిర్మించిన 'మయూరి' సినిమా చూశాను. అప్పుడు 'జీవనసమరం' కథ గుర్తొచ్చింది. నవలలో అలెక్సీ, సినిమాలో మయూరి అనుకోనిరీతిలో కాళ్లు కోల్పోయినవారు. ఎలాగైనా తిరిగి డాన్స్ చేయాలని ఆమె, విమానం నడిపి శత్రుసైన్యాన్ని తరిమికొట్టాలని అతను జీవనపోరాటం చేస్తారు. ఆమె లక్ష్యం వ్యక్తిగతమైనది కాగా, అతనిది దేశభక్తితో కూడుకున్నది. దేశం కోసం పెట్టుకున్నది. వికలాంగులుగా అది అసాధ్యమైనప్పటికీ సాధ్యం చేసి చూపించి తరతరాలకు స్ఫూర్తిప్రదాతలుగా నిలుస్తారు.

ఈ సందర్భంగా చెప్పుకోవాల్సిన సంఘటన ఒకటి వుంది. 98లో వియత్నాం ట్రేడ్ యూనియన్ నుంచి ఆహ్వానం వచ్చింది, మహాసభకు ప్రతినిధిని పంపమని. అప్పుడు సిఐటియు ఆలిండియా ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర అధ్యక్షుడిగా వున్న నన్ను ఎంపిక చేశారు. అప్పటికి సంవత్సరం క్రితం హార్ట్ ఎటాక్ రావడంతో డాక్టర్ అనుమతి మేరకు ప్రయాణానికి సిద్ధమయ్యాను. అది పదకొండురోజుల టూర్. అక్కడికి సుకోమల్‌సేన్, ఇంద్రజిత్ గుప్తా, మహేంద్ర కూడా వచ్చారు. ఓరోజు సముద్రం మధ్యనున్న కొండల సందర్శన కార్యక్రమం ఏర్పాటుచేశారు. నేనూ బయలుదేరాను. సముద్రంలో నీరు నిశ్చలంగా వుంది. లోపల లోతు ఎంత ఎక్కువగా వుంటే పైన నీరు అంత నిశ్చలంగా వుంటుందన్నది తెలిసిందేకదా. కొండలోపల పైకి మెట్లున్నాయి. పైగా ఏటవాలుగా వున్నాయి. అంతా హుషారుగా ఎక్కుతున్నారు. కొంత దూరం పోయాక నాకు అలుపొచ్చింది. గమ్యం చేరగలనా లేదా? అన్న శంక మొదలైంది. మరోవైపు శారీరక శ్రమ కూడదన్న డాక్టర్ సలహా గుర్తొచ్చింది. అవస్థగావుంది కాబట్టి వెనక్కి వెళ్దామా? అంటే చేరాల్సిన గమ్యం చేరకుండా వెనక్కి వెళ్లడమేంటి? తోటివారి దృష్టిలో గమ్యం చేరలేక వెనక్కి వెళ్లినట్టవుతుందికదా! అనిపించి ధైర్యం చేసి ముందుకే అడుగులు వేశాను. ఆ గమ్యమే నన్ను ముందుకు నడిపించింది. ఆ క్షణంలో నాకు 'జీవనసమరం' హీరో అలెక్సీ గుర్తురాలేదు. కానీ అతనిచ్చిన స్ఫూర్తి నాలో నిండుగా వుంది. 1947 నుంచి 98 వరకు ఎన్నో ఆటంకాలను, సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు నడిచాను. కానీ అవి వేరు. ఇది వేరు. వాటిలో పోలీసుల కంట పడకుండా గమ్యం చేరడం ఎలా? వారి నుంచి తప్పించుకోవడం ఎలా? వంటి ఆలోచనలు వుండేవి. ఇది అలా కాదే! శారీరక సమస్య. ఇదేకాదు. ప్రతిసారీ అదే స్ఫూర్తితో ప్రజాఉద్యమంలో ముందుకు నడిచాను. నడుస్తున్నాను. ఎన్ని అవాంతరాలొచ్చినా అధిగమించి ముందుకు సాగాలన్న స్ఫూర్తే నన్ను ఇప్పటిదాకా నడిపిస్తోంది.

నాకు స్ఫూర్తినిచ్చిన మరో పుస్తకం సర్దార్ పృథ్వీసింగ్ జీవిత చరిత్ర. పృథ్వీసింగ్ ప్రఖ్యాత గదర్ వీరుడు. ఆయన జీవిత చరిత్రను 1944లోనో, 1945లోనో చదివాను. పృథ్వీసింగ్‌ను నిర్బంధించి కాళ్లకు, చేతులకు బేడీలు వేసి రాజమండ్రి జైలుకు రైల్లో తీసుకు వెళ్తుండగా గొలుసులతోనే రైలునుంచి దూకుతాడు. ఆంధ్ర ప్రాంతంలో ఇది జరుగుతుంది. రైతుల సహకారంతో పంజాబ్‌కు చేరతాడు. అక్కడనుంచి రహస్యంగా ఆఫ్గనిస్తాన్ మీదగా సోవియట్‌లోకి అడుగుపెడతాడు. ఆ సమయంలో ఆయన పొందిన అనభూతే నేను ఔరంగాబాద్ జైలు నుంచి తప్పించుకున్నప్పుడు కలిగింది.

ఇంత మంచి నవల చదవమని ఎందరికో చెప్పాను. 1958-60 మధ్యకాలంలో సాహిత్య వారోత్సవాలు జరిపేవారు. అందులో భాగంగా కార్యకర్తలు పుస్తకాలు అమ్మేవారు. మోటూరు ఉదయంగారు కొత్తగూడెం వచ్చినప్పుడు 'జీవనసమరం' కథ చెప్పాను. ఆవిడ విశాలాంధ్ర బుక్‌హౌస్ గోడౌన్‌లో అతికష్టంమీద వెతికించి మరీ సంపాదించి రెండు మూడు వందల పుస్తకాలమ్మారు. 1975లో ఎమర్జన్సీ వచ్చినప్పుడు రెండేళ్లపాటు రహస్య జీవితం గడిపాను. విజయవాడ, హైదరాబాదు, బందరు ... ఇలా కేంద్రాలు మార్చుకుంటూ రహస్యంగా అభిమానుల ఇళ్లల్లో తలదాచుకున్నా. వారికి 'ఈ పుస్తకాలు చదువుకోండి' అంటూ పది పన్నెండు పుస్తకాల జాబితా రాసిచ్చేవాడ్ని. అందులో 'జీవనసమరం' తప్పకుండా వుండేది. ఇప్పటికీ చెప్తూనే వున్నా.

★

నా పల్లె మారిపోయింది...

మామిండ్లపల్లి రాము

నా పల్లె మారిపోయింది... మారిపోతోంది... మారిపోతూనే ఉంది... అవును పల్లె సంస్కృతులూ, సంప్రదాయాలూ మారిపోతున్నాయి. చేతి వృత్తులూ నాశనమవుతున్నాయి... అంతేనా! పల్లె ఖాళీ అవుతోంది... పట్నం దారి పడుతూ కన్నీరు పెడుతోంది... తొలకరి జల్లులకు తడిసిన నేలమట్టి పరిమళాలు మాయమవుతున్నాయి... వెన్నెల వెలుగులపై రచ్చబండ ముచ్చట్లూ అదృశ్యమవుతున్నాయి!

అప్పట్లో మా పల్లె మసకసీకట్లోనే నిద్రలేచేది. పచ్చనిసెట్లలో పక్షుల కిలకిలా రావాలు..కోళ్లగూటిలో కోడిపుంజుల కూతల నడుమ నేను నిద్రలేస్తుంటే మనసుకు ఉల్లాసంగా ఉండేది. సగం కళ్లు తెరుస్కుంటూ బయటికి వస్తే నాకు అదే ఎక్కడా లేనంత సంతోషం. అంతకంటే ఆనందం మరొకటి ఉండేది కాదు. అటూ ఇటూ తిరిగే సరికే మా ఇంటి ఎనకాల సూర్యుడు భగభగ మండుకుంటూ బయటికి వచ్చేవాడు. నాకే ముందు కనిపిస్తుండా అన్నట్లు ఉండేవాడు. పోరలమంతా కలిసి చిర్రగోనె, గోటీలు, కోతికొమ్మచ్చ అడుతుంటే ఆ ఆనందమే వేరు. బతుకమ్మ పండుగ వచ్చిందంటే తొమ్మిది రోజులూ సంబురమే సంబురం. తంగేడు పూల కోసం పొద్దుపొద్దుగాల్నే లేచి అడవికెల్లి ఆ చలికి తంగేడు పూలు కోస్తుంటే వాటిపై పడ్డ మంచు బిందువులు చేతికి తాకుతుంటే ఆ అనుభూతి మళ్లీ బతుకమ్మ దాకా గుర్తుకుండేది. బతుకమ్మలు తయారు చేశాక అక్కాసెల్లెళ్లతో బతుకమ్మలతో చెరువుల దగ్గరికి, వాగుల దగ్గరికి ఎల్లి ఆడుతుంటే నాకు మహా సంబురం అయ్యేది. ఆడపడుచులు ఆడి పాడిన తర్వాత బతుకమ్మలను చెరువుల్లో వేసి ఇంటికి వచ్చేవాళ్లం. హోళీ పండుగ వచ్చిందంటేనే కాదు కాదు ఇంకా 15 రోజులకు వస్తుందంటేనే మహా ఆనందం. అప్పటి నుంచే మా పండుగ మొదలయ్యేది. గోగుపువ్వులు తెచ్చి రంగునీళ్లు చేసి పన్నెండు గంటల దాకా ఆడుకునేటోళ్లం అమ్మ కోప్పడే దాకా...మా పల్లెలో చేతివృత్తులు మంచిగా ఉండేవి. పొద్దు పొద్దుగాల్నే పనులు ప్రారంభించేటోళ్లు. కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, దూదేకుల, మేర, ఇలా అందరూ పొద్దు పొద్దుగాల్నే తమ పనిలో నిమగ్నమయ్యేవారు. అరకల కోసం వడ్రంగుల వాకిళ్ల ముందు ఆసాములు యాపపుల్లలేసుకొనే బారులు తీరేటోళ్లు. దాంతో ఆ విశ్వకర్మలకు చేతినిండా పనిఉండేది. వారందరినీ చూస్తుంటే మనసు నిండా సంతోషం ఉండేది. ఏడాది పాటు గాసమెళ్లేది. ఇంటిల్లిపాది సుఖసంతోషాలతో ఉండేవారు. కుమ్మరి కుండలను తయారు చేస్తుంటే పోరలమంతా అక్కడే ఉండేవాళ్లం. అతను తయారుచేసే తీరుకు ఆశ్చర్యపోయేవాళ్లం. ఎండాకాలం వచ్చిందంటే మా పల్లెల్లోని ఇండ్లలో మొత్తం ఆ కుమ్మరి తాత కుండలే దర్శనమిచ్చేవి. ఎండలో తిరిగి తిరిగి వచ్చి కుండలో నీళ్లు ఒక్కసారి తాగితే కుమ్మరి తాతను తలుసుకోకుండా ఉండేవాళ్లం కాదు. పంద్రాగస్టు వచ్చిందంటే చాలు మేర జానయ్య తాత దగ్గర నిలబడనీకి సందుండేది కాదు. కాళ్లు గుంజేటివి. అయినా బట్టలు ఇస్తడో లేదోనని గాబరా పడేటోళ్లం. కానీ తాత అందరికీ అందిచ్చేటోడు. తాతకు థాంక్స్ చెప్పి 'జై బోలో భారత్ మాతాకి' అనుకుంటూ అక్కడినుంచి బడికెళ్లేటోళ్లం. దూదేకుల అమ్మ దూదిని ఏకీఏకీ పరుపులు చేస్తే మేం కొంటుంటిమి. చేస్తున్నప్పుడు ఆమె ఒళ్లు, ఇల్లు అంతా దూదే ఉండేది. మా పల్లెకు సుట్టాలొస్తే ఎవ్వరమైనా ఆ గౌడ్ దగ్గర ఈత కల్లుతెచ్చేటోళ్లం. కల్లు తాగి అన్నంతిని సుట్టాలేమో మంచిగ ఉంటిరి. కంసలి వాళ్లు మరుగుభాషలో బేరం ఆడేవాళ్లు. పెళ్లి జరిగితే ఆళ్లకు చేతి పనిదొరకేది. చిన్నపిల్లలకు గజ్జెల దగ్గరి నుంచి ఇంట్లోని వారందరూ ఆ కంసలి వీధుల్లో పనుల చేయించుకొనేవారు. దీంతో వారికి సంతోషంగా ఉండేది. పల్లెలో ఎద్దుల బండి ఉందంటే చాలు! వారికి ఏడాది మొత్తం పని ఉండేది. ఇల్లు కడితే రాళ్లు, ఇటుక, సిమెంటు, సెలకల్లోకి ఎరువు ఏసేవరకూ పని ఉండేది. పల్లంతా సుఖంగా, సంతోషంగా ఉండేది. అలాంటి పల్లె ఇప్పుడు మారిపోయింది.

ఇప్పుడేలా ఉందంటే చేతివృత్తుల చేతులు ఇరిగిపోయినవి. చేత్తానికి పని దొరకడం లేదు. తినడానికి ఒక్కరికీ తిండి దొరకడం లేదు. పల్లె పట్నం దారి పడుతోంది. పనులు వెతుక్కుంటూ పల్లెవాసులు హైదరాబాద్‌కు వలసలు పడుతున్నారు. విశ్వకర్మలు పనిచేద్దామంటే నాగలి దగ్గరి నుంచి కుర్చీ దాకా ఇనుము, ఫైబర్ వచ్చాయి. దీంతో వారి వృత్తికి ఆదరణ కరువైంది. ఆసాములంతా కూసొనేటి వడ్రంగుల వాకిళ్లు దుక్కిలి లేచి దుఃఖిస్తున్నాయి. బట్టలేమో రెడీమేడ్ ఫ్యాషన్ దుస్తులు వచ్చినవి. చెడ్డీ దగ్గరి నుంచి అన్నీ రెడీమేడ్‌లో దొరుకుతుండడంతో మేరొళ్ల కత్తెర చిలుము పట్టిపోయింది. చేద్దామన్నా పనిలేక దుఃఖిస్తున్నారు. కుమ్మరి కుండలు చూసిన వాళ్లే కరువవుతుండ్రు. ఫ్రిజ్‌నీళ్లనే తాగుతుర్రు. పెద్ద పట్టణాల కంపెనీల రాకతో కంసలి వీధులు వన్నెతగ్గినవి. అందరూ అడిగేవారే కానీ కొనేవారేలేరు అన్నట్లు ఉంది వారి పరిస్థితి. ఆర్థిక పరిస్థితి తట్టుకోలేని కొందరు ఈ మధ్య ఆత్మహత్యలకు పాల్పడ్డ సంఘటనలూ ఉన్నాయి. పల్లెలకు విస్కీ, బ్రాందీలు దాపురించినయి. బుసబుసపొంగే వీటికే పల్లె జనాలూ అలవాటు పడ్డారు. గౌడ్ కుంగిపోతున్నాడు. బతుకమ్మ పండుగ సంబురమే పోయింది. బతుకమ్మలు వేయడానికి చెరువులే లేకుండా పోయినయ్. మన రాజకీయ నాయకుల చలవతో అవి కబ్జాల్లో ఉన్నయ్. ఉన్న చెరువుల్లోనూ 'దేవుడి పాలన' పుణ్యామా అని అందులోనూ నీళ్లు లేవు. చేతివృత్తులకు చేయూతనందించాల్సిన ప్రభుత్వం చూస్తూ ఉండిపోతుందే తప్ప ఆదుకోవడం లేదు. కుటీర పరిశ్రమలు పెట్టి ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఆ పనిచేయడం లేదు. దీంతో పల్లెలన్నీ ఖాళీ అవుతున్నయ్.

★

తెలుసా!

రబ్బర్ మనిషి



1830లో ఛార్లెస్ గుడ్ ఇయర్ అనే పెద్ద మనిషి తన తండ్రి వృత్తినే చేపట్టి దివాలా తీశాడు. ఆ రోజుల్లో అప్పులు తీర్చలేని వాళ్ళకు జైలు శిక్ష విధించేవారు. ఆ క్రమంలో గుడ్ ఇయర్ చాలా సార్లు జైలుకెళ్ళి వచ్చాడు. 1834 లో గుడ్ ఇయర్‌కి రబ్బర్ విషయం ఆసక్తి రేకెత్తించింది. ఆ రోజుల్లో రబ్బర్‌ను నీటి నిరోధక సామాగ్రిగా మాత్రమే వాడేవారు. చాలా మంది పరిశోధకులు రబ్బర్‌ను అటువంటి సామాగ్రి తయారు చేయడానికే వినియోగించేవారు. రబ్బర్‌తో వచ్చిన చిక్కేమిటంటే అది బాగా చలికాలంలో బిరుసుగా, వేసవి కాలంలో సాగిపోతూనే వుండేది. అయితే రబ్బర్‌ను ఏ పనికి ఉపయోగిస్తున్నా మరింత స్థిరంగా వుంచగలిగేందుకు మార్గాన్ని కనుగొనాల్సి ఉంది. గుడ్ ఇయర్‌కు రసాయన శాస్త్రంలో ప్రవేశమేమీ లేకపోయినా ఆ పనికి పూనుకొన్నాడు. ఒక రోజు పరిశోధన సాగుతుండగా రబ్బర్, సల్ఫర్‌ల మిశ్రమం కొంత భాగం అప్పుడే ఆర్పిన స్టవ్ మీద పడింది. దాన్ని చుట్టి తీసిన గుడ్ ఇయర్ ఆ మిశ్రమం చేతికి అంటుకోకుండా పొడిగా వుండడాన్ని గుర్తించాడు. వెంటనే ఆ మిశ్రమాన్ని బాగా తక్కువ ఉష్ణోగ్రతలో వేసి చల్లబరిచాడు. ఆ శాంపిల్ రబ్బర్ వేడిగా వున్న సమయంలోనూ, చల్లగా వున్న సమయంలోనూ తన లక్షణాన్ని కోల్పోక మృదువుగా వుండడాన్ని గుడ్ ఇయర్ గుర్తించారు. ఇప్పుడు రబ్బర్‌కు సల్ఫర్‌ను కలిపే విధానాన్ని వల్కనైజేషన్ అని పిలుస్తున్నారు. గుడ్ ఇయర్ కనుగొన్న ఈ విధానం ఆ తరువాత రబ్బరు పరిశ్రమ స్థాపనకు, చాలా మంది చాలా రకాల పెద్ద పెద్ద పరికరాలు కనుగొనడానికి ఉపయోగపడింది. అయితే ఈ విధానాన్ని కనుగొన్న గుడ్ ఇయర్‌కు మాత్రం దీనివల్ల ఒక్క పెన్నీ కూడా లభించలేదు. అతను తన అప్పుల్లోనే 1860 జులై 1న చనిపోయాడు.

వింత శిక్ష

స్వీడన్‌రాజు గస్టవ్ 3కు కాఫీ అంటే పడేది కాదు. ఈయన కాఫీ విషతుల్యమని నమ్మేవాడు. తన రాజ్యంలోని ప్రజలకు కాఫీ ఆరోగ్యానికి హానికరమని తెలియచెప్పడానకి ఒక హంతకునికి చనిపోయేవరకూ ప్రతి రోజూ కాఫీ ఇవ్వాల్సిందిగా శిక్ష విధించాడు. ఈ హంతుకుని కవల సోదరుడు కూడా అదే జైలులో టీ తాగాలనే శిక్ష అనుభవిస్తున్నాడు. ప్రజల్లో అత్యంత ఆసక్తి రేకెత్తించిన ఈ ప్రయోగాన్ని పర్యవేక్షించడానికి ఇద్దరు డాక్టర్లను నియమించారు. ప్రజలు ప్రతి రోజూ కాఫీ తాగుతున్న హంతకుని గూర్చి వివరాలడిగేవారు. ఆఖరుకు ఒక రోజు ఒకరి చావుగూర్చి తెలిస్తుంది. అయితే చనిపోయింది శిక్ష అనుభవిస్తున్న వారు కాదు. వారిని పర్యవేక్షిస్తున్న డాక్టర్లలో ఒకరు. ఆ తర్వాత కొద్ది రోజులకే రెండవ డాక్టర్ కూడా చనిపోతాడు. కొన్నాళ్ళకు రాజుకూడా హత్య గావించబడ్డాడు. నేరస్థులు మాత్రం ఆ పానీయాలను సేవిస్తూనే వున్నారు. ఆ తర్వాత కొన్ని సంవత్సరాలకు టీ తాగుతున్న నేరస్థుడు తన 83 వ ఏట చనిపోయాడు. కాఫీని తాగుతున్న నేరస్థుడు మాత్రం ఎప్పటిలాగే నిక్షేపంగా వున్నాడు. కానీ అధికారులు ఈ ప్రయోగ ఫలితాలనేవీ గమనంలోకి తీసుకోకుండా 1822లో స్వీడన్‌లో కాఫీని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం తమాషా.

కాలువల నిర్మాణం ఆరంభమైందిలా

ప్రపంచంలోకెల్లా పురాతనమైన, ఇప్పటికీ చెక్కుచెదరకుండా నిలిచివున్న కాలువ చైనాలోని 'గ్రాండ్ కెనాల్'. వెయ్యి మైళ్ల పొడవున్న ఈ కాలువ క్రీస్తుపూర్వం 5వ శతాబ్దంలో నిర్మితమైంది. ఇది హాంగ్‌చౌ, పెంకింగ్‌ల మధ్య ఉంది. ఈ కాలువ ముఖ్య భాగాలను క్రీస్తుశకం 13వ శతాబ్దంలో నిర్మించారు. ప్రస్తుతం 'సూయజ్ కాలువ'గా మనం పిలుస్తున్న కాలువను ఈజిప్షియన్లు క్రీస్తుపూర్వం 2000నాడు నైల్ నదిని, ఎర్ర సముద్రాన్ని కలుపుతూ నిర్మించారు. తరువాత బాబిలోనియాలో టైగ్రిస్, యూఫ్రటీస్ నదులను కలుపుతూ నెబూఛడ్‌నెజర్ 'రాయల్' కాలువను నిర్మించాడు. రోమన్లు కూడా తమ సామ్రాజ్యంలో చాలా కాలువలను నిర్మించారు. రైన్, మాస్, డాన్యూబ్ నదులను కలుపుతోన్న కాలువలను ఎనిమిదవ శతాబ్దంలో ఛార్లీమాగ్నే నిర్మించాడు. ఆ తరువాత కాలంలో ఇటలీ, ఫ్రాన్స్, బెల్జియం ఇంకా యూరప్‌లోని ఇతర ప్రాంతాల్లో కాలువ నిర్మాణాలు అనూహ్య రీతిలో అభివృద్ధి చెందాయి. పద్దెనిమిదవ శతాబ్దం రెండవ అర్ధభాగంలో గ్రేట్ బ్రిటన్‌లో బొగ్గు, ఇంకా ఇతర వస్తువుల రవాణా కోసం కాలువల నిర్మాణాలు చేపట్టారు. ఇవి 1820లో రైల్వేలను కనుగొనే వరకు కొనసాగాయి. నగరాల్లో నుండి సముద్ర ఒడ్డుకు వస్తువులను కాలువల ద్వారా రవాణా చేశారనడానికి మాంచెస్టర్ షిప్ కెనాల్ గొప్ప ఉదాహరణగా చెప్పవచ్చు. 1759-1830ల మధ్య ఇంగ్లాండ్‌లో 4,790కి పైగా కాలువలను నిర్మించారు. కాలువల నిర్మాణాల్లో ప్రజలు కూడా పెట్టుబడులు పెట్టేవారు. కాలువలు నిర్మించే కొన్ని కంపెనీలు ప్రజలకు పెద్ద మొత్తంలో డివిడెండ్లు చెల్లించేవి. కాలువల్లో బోట్లు నడవడానికి ప్రస్తుతం మోటార్లు బిగిస్తున్నారు. అలాగే చిన్న చిన్న బోట్లను వెదురుబొంగుల సాయంతో మనుషులే నడుపుతుండేవారు. కానీ కాలువలు నిర్మించబడిన తొలినాళ్లలో బోట్లను గుర్రాలు, కంచర గాడిదలు ఒడ్డు నుండి లాగుతుండేవి.



చూద్దామా


చక్రతీర్థం



నైమిశారణ్యం

నైమిశారణ్యం సీతాపూర్ జిల్లాలో హర్దోయి-సీతాపూర్ రోడ్డులో ఉంది. ఎటుచూచినా పచ్చగా, చిక్కగా పరచుకున్న అరణ్యం. ఎక్కువగా మర్రి, మామిడి, చింత లాంటి వృక్షాలు చాలా ఎత్తుగా పెరిగాయి. స్వచ్ఛమైన ప్రకృతి ఒడిలోని ప్రశాంతతా, గాంభీర్యమూ చూసినప్పుడు మనసుకు ఎంతో ఆహ్లాదంగా వుంటుంది. ఒకనాడున్న ఋషిగణాలిప్పుడు లేకపోయినా, ఏ పుణ్యభూమిలోనైతే సూత మహాముని నోటి నుండి పురాణాలన్నీ వెలువడ్డాయో, ఏ ప్రదేశం ఋషిగణాల పవిత్ర ధార్మిక జీవనంతో మానవుని జీవన శైలికి ఒరవడి దిద్దిందో, కథ అనేది ఎక్కడ పుట్టిందో, ఆశ్రమధర్మ నిబద్ధమైన కథలూ, గాధలూ స్రవించి ఎంత విద్యావిహీనునికైనా ఈ జీవన సంఘర్షణలో చక్కని వెలుగుబాటలు పరచాయో, ఆప్రదేశంలో కాలూని, ధర్మసంరక్షణ కొరకు ఇక్కడ జరిగిన పరిశ్రమను మననం చేసుకోవటం ఒక తీయని అనుభూతి. ఇతిహాసాల రూపంలో నిర్దిష్టమైన జీవన మార్గాన్ని ప్రవచిస్తూ, ఈ భూమిని పుణ్యభూమిగా, కర్మభూమిగా తీర్చిదిద్దిన అసాధారణ ప్రక్రియ ఇక్కడే ఆవిర్భవించింది. సార్వజనీనమైన విలువలు కథల రూపంలో పొదగి, వీటి అవగాహన, ఆచరణ, పామరులకు సైతం సులభతరంచేసిన ఈ పుణ్యభూమికి మనసారా నమస్కరించాలనిపిస్తుంది.

చక్రతీర్థం

ఈ చక్రపాతానికిక్కడొక సరస్సు ఏర్పడింది. దీనినే చక్రకుండం లేక చక్రతీర్థం అంటారు. వృత్తాకారంలో వున్న దీనికి చుట్టూ మెట్లున్నాయి. ఇక్కడి స్నానం అన్ని పాపాలనూ కష్టాలనూ నివారిస్తుందని ప్రజల విశ్వాసం.

భూతేశ్వరాలయం

ఈ పక్కనే భూతేశ్వరాలయముంది. నల్లని లింగాకృతికి తెల్లని వెండి నేత్రాలనమర్చడం వల్ల చూడగానే కొంత భయం కలిగిస్తుంది.

వ్యాసగద్ది

ఇక్కడ గోమతీ తీరాన చిన్న కొండ మీద వున్నది వ్యాసగద్ది. ప్రాచీన కాలంలో గోమతిని ధ్యానమతి గంగ అనేవారట. ఇక్కడ నిలుచుని చూస్తే, ఒకపక్క ప్రవహించే గోమతి, మూడు పక్కలా దట్టంగా వ్యాపించిన అరణ్యంతో మనోహరమైన దృశ్యం కనువిందు చేస్తుంది. ఇక్కడ చిన్న మందిరాన్ని నిర్మించారు. ముందున్న యజ్ఞశాలలో ఇప్పటికీ యజ్ఞాలు నిర్వహిస్తుంటారు. వచ్చినవారు యజ్ఞవాటికకు ప్రదక్షిణ చేసి అందులోవున్న భస్మాన్ని నుదుట ధరించి వ్యాసగద్ది దర్శిస్తారు. ప్రక్కనే వేదవ్యాసుడు ఈ గద్దెపై కూర్చుని మహాభారతేతిహాసాన్ని ప్రవచిస్తుంటే గణపతి లేఖకుడుగా అక్షరబద్ధం చేశాడని ప్రతీతి. పక్కనే వ్యాసుని కుమారుడు శుకదేవుని విగ్రహముంది. పాలరాతితో మలచారు. కొద్దిగా కింద పరీక్షిత్తు, శ్యాంచరణ్‌దాసు మహారాజుల విగ్రహాలున్నాయి. ఈ శ్యాంచరణ్‌దాసు శుకమహర్షి శిష్యుడు. భక్తి సాగరం అనే మహాగ్రంథాన్ని రచించాడు.

ఇక్కడ వ్యాసుని గురించి స్మరించాలి. ఏ ఒక్కరూ వేద విద్యను సంపూర్ణంగా అధ్యయనం చేయలేరని గ్రహించి దానిని నాలుగు భాగాలుగా విభజించి తన శిష్యులైన పైలునికి ఋగ్వేదము, వైశంపాయనునికి యజుర్వేదము, జైమినికి సామవేదము, సుమంతునికి అధర్వణవేదము తెలిపి వీటి ఉప వేదాలను గూడా అనుగ్రహించారు. వీటిలో కొన్ని శాఖలు అంతరించినప్పటికీ గురుశిష్య పరంపరానుగతంగా ఈనాటికీ పదిలంగా నిలిచివున్నాయి. అంతే కాదు. ఎంత విద్యాగంధం లేనివారికైనా సకల వేదసారాన్ని మనస్సులో నిక్షిప్తం చేసుకోగలిగే విధంగా, అడుగడుగునా ఉత్కంఠను రేకెత్తించే కథనాశిల్పంతో ఇతిహాసాలు, పురాణాలు, ఉపపురాణాలు రచించాడు. ఉపనిషత్తుల సారాన్నంతా భగవద్గీతగా మలచి మానవాళికందించాడు.

వ్యాసగద్దికి పక్కనే చిన్న విష్ణు మందిరమున్నది. ఈ ప్రదేశంలో స్వాయంభువ మనువు, ఆయన భార్య శతరూపతో కఠోరమైన తపమాచరించాడని ప్రతీతి.

పరిక్రమణ

నైమిశారణ్యంలో 84 క్రోసుల పరిక్రమణ అనేదొకటి ఆచరణలో వుంది.

ఫల్గుణమాసంలో ఈ పరిక్రమణ నైమిశారణ్యంలో మొదలై, 11 పవిత్ర క్షేత్రాలలో మజిలీలు చేసుకుంటూ, మాఘమాసంలో ప్రయాగలోని త్రివేణి సంగమం వద్ద ముగుస్తుంది. చేయగలిగినవారికి మంచి అధ్యాత్మిక శారీరక శిక్షణే.

దధీచి కుండము

ఇది ప్రసిద్ధికెక్కిన స్థలం. దీనికో పౌరాణిక గాథ వుంది. దేవదానవ యుద్ధాలు తరతరాలుగా సాగుతున్నవే. ఒక యుద్ధంలో రాక్షసులు విజృంభించి, దేవతలనందరినీ చంపుతున్నారట. ఇక సాహసించలేక ఇంద్రుడు విష్ణువును సమీపించి దేవతలకు పరాజయం తప్పేటట్లులేదని విన్నవించుకున్నాడట. ఆయన సలహా మేరకు దధీచి మహర్షి ఎముకతో తయారుచేసిన ఆయుధం రాక్షస సంహారం చేయగలదని తెలుసుకొని, ఈ కోరికతో ఆ మహర్షిని దర్శించి వేడుకున్నాడట ఇంద్రుడు. ఇది ఎంత దారుణమైన కోరికో ఊహించటానికి కూడా సాధ్యంకానిది. కాని ఆ మహాత్ముడు ఈ కోరిక లోక కళ్యాణార్థమని గ్రహించి, యోగమార్గాన తన శరీరాన్ని త్యజించాడట. ఆయన సుదీర్ఘ తపస్సుతో, అనూహ్యశక్తి సంపన్నమైన ఆయన ఎముకతో ఇంద్రుడు వజ్రాయుధాన్ని తయారుచేసుకుని విజయం సాధించాడట. యిప్పటికీ ఇదే ఇంద్రుని ఆయుధం. ఈ సంఘటన జరిగిన ప్రదేశంగా ఈ దధీచికుండానికి ప్రత్యేకమైన ప్రాశస్త్యం వుంది. ఒకరు తాను బలహీనుడైనా తన స్థానం పదిలపరచుకునేందుకు ఎలాంటి కోరికకైనా సిద్ధపడటం, మరొకరు లోకకళ్యాణార్థం, తన శరీరాన్ని తృణప్రాయంగా త్యజించిన త్యాగనిరతి, రెండూ ఇక్కడ గోచరిస్తాయి.

లలితాదేవి ఆలయం

నైమిశారణ్యాన్ని నివాసయోగ్యంచేసి అనుగ్రహించిన దేవత. ఈ మందిరాన్ని దక్ష యజ్ఞం విధ్వంసంతో కలుపుతూ యిక్కడ హిందీలో రాసి వుంది. విశాలమైన ముఖమంటపం. పాలరాతితో మలచిన తోరణంలో అమర్చిన లలితాదేవి విగ్రహం నిత్య పూజలందుకోంటుంది. భక్తజన సందోహంతో కళకళలాడుతోంది.

అహోబిలమఠం

మన అహోబిలమఠం వారిక్కడ నిర్మించిన ఆలయంలో నారసింహుని పంచలోహ విగ్రహం నిత్య పూజలతో అలరారుతోంది.

పురాణపురుషమందిరం

ఇక్కడ ఆనందమయి మాత ఫౌండేషన్ వారు నిర్మించిన పురాణ పురుషుని మందిరం చాలా అందమైన నిర్మాణం. పురాణ పురుషుని విగ్రహం పంచలోహంతో మలచారు. చిలుక తలతో, అభయముద్రలో, ప్రశాంత గంభీర వదనంతో వుంటుంది. ఇక్కడ పురాణాం మీద పరిశోధన జరుగుతోంది. 18 పురాణాల తాళ పత్ర గ్రంథాలు పట్టుబట్టలో చుట్టి ఒక వేదిక మీద ఉంచారు. దీని చుట్టూ రేలింగ్ అమర్చి ఒక పక్క వేదవ్యాసుని విగ్రహం ప్రతిష్ఠించారు. మరో పక్క సూతుని విగ్రహముంది. దీనికి ప్రక్కనే బహు విశాలమైన గోష్ఠిమందిరం పెద్ద పెద్ద పట్టుపురుపులతో, గద్దెలతో పవిత్ర వాతావరణం ఆవరించింది వుంది.

హనుమాన్ ఘరి

ఈ కొండ మీద మరికొంత ముందున్నది హనమాన్ ఘరి. దీనికోకథ. రామరావణ యుద్ధంలో మైరావణుడు (అహిరావణుడని గూడా అంటారు) విభీషణుని రూపంలో వచ్చి, తన మాయతో రామలక్ష్మణులను బొమ్మలుగా మార్చి, పాతాళానికి తీసుకుపోయినపుడు ఈ మోసాన్ని గ్రహించిన హనుమంతుడు పాతాళలంక చేరి మైరావణుని సంహరించి మాయా విచ్ఛేదం చేసి రామలక్ష్మణులను తన భుజాలమీద భూమికి చేర్చిన ప్రదేశమిదేనని కథనం. ఇక్కడ నిలువున్నర ఎత్తున హనుమంతుని విగ్రహం కింద మైరావణుని కాళ్ళతో తొక్కుతున్నట్లు రెండూ భుజాలమీద రామలక్ష్మణులను ఎత్తుకున్నట్లు మలచారు.

నైమిశనాథ మందిరం

ఈ క్షేత్ర దేవుని మందిరం ప్రవేశింపగానే నల్లరాతి విగ్రహానికి బంగారు తొడుగులతో మెరిసిపోతుంటాడు. కింద ఉత్సవమూర్తి ఇద్దరు దేవేరులతో కొలువుదీరి వున్నాడు. ఇది మన వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని పోలివుంది. నామం మాత్రంలేదు. నిత్య పూజలతో కళకళలాడుతోంది.

బలరాముని ఆగమనం

ఇక్కడ జరిగిన బలరాముని గాథ, మానవ స్వభావాన్ని గురించి మనలను ఆలోచనలో పడేస్తుంది. కురుక్షేత్ర సంగ్రామానికి సన్నాహాలు జరుగుతున్నాయి. బలరాముడు తాను తటస్థంగా వుండిపోవాలని నిశ్చయించుకుని, తీర్థయాత్రలకు బయలుదేరి, దానిలో భాగంగా నైమిశారణ్యం చేరుకున్నాడు. ఆ సమయంలో మునులందరూ ఆధ్యాత్మిక విషయాలపై సుదీర్ఘమైన సత్సంగంలో వున్నారు. బలరాముని చూసి అందరూ లేచి నమస్కరించారు. సభకు ఆచార్యపీఠాన్నలంకరించిన వారు ఇలా లేవకూడదు. కనుక ఆ స్థానంలో వున్న రోమహర్షణుడు (సూతుడు) లేచి నమస్కరించలేదు. ఇది అవిధేయతగా భావించి దీనిని సహించలేని బలరాముడు సూతుని శిరస్సు ఖండించాడు. మునిగణాలలో అహంకారాలు చెలరేగినాయి. ఈ ఉద్విగ్నత కొంత ఉపశమించిన తరువాత ఈ బ్రహ్మహత్యా పాతకానికి బలరాముని ప్రాయశ్చిత్తం చేసుకోమన్నారు. అప్పటికే పశ్చాత్తాపపడుతున్న బలరాముడు ప్రాయశ్చిత్తమేదో వారినే నిశ్చయింపమన్నాడు. వారు అక్కడ బల్వుడనే రాక్షసుడు మహా భయంకరుడు. అమావాస్య, పౌర్ణమి రోజులలో మా సమావేశాలను భగ్నం చేస్తూ, రక్త మలమూత్రాలు మాపై కురిపిస్తున్నాడు. ముందు వాణ్ణి సంహరించి మాకుపకారం చేయి. తరువాత 12 మాసములు బ్రహ్మవర్తంలోని సకల తీర్థాలు సేవిస్తే బ్రహ్మ హత్యాపాతకం నుంచి విముక్తుడవుతావని తెలిపారు. ఇంతలో పౌర్ణమిరానే వచ్చింది. పెద్ద తుఫాను చెలరేగి, చీము, రక్తమూ వర్షిస్తూ నల్లని పర్వతాకారంలో అతి భయంకరంగా బల్వలుడు విజృంభించాడు. బలరాముడు తన ఆయుధాలను స్మరించగనే అతని గద, నాగలి చేతికి వచ్చాయి. బలరాముడు గదతో వాడి తలవ్రక్కలు చేశాడు. వాడు భయంకరంగా అరుస్తూ నేలకొరిగారు. మునులందరూ మంత్రజలం చల్లి బలరాముని ఆశీర్వదించారు. అప్పుడు బలరాముడు వేద ప్రమాణపరంగా మానవుడు తన ప్రతిరూపంగా పుత్రుడై జన్మిస్తాడు గనుక యికనుండి రోమహర్షుని తనయుడు మీకు పురాణ ప్రవచనం చేస్తాడు. అతనికి దీర్ఘాయువు, బలము ఇంద్రియపటుత్వము ప్రసాదిస్తున్నానని అన్నాడట. మునులందరూ అంగీకరించి అతణ్ణి వైజయంతి మాలతో సత్కరించి పంపారట. ఈ గాథ వింటే క్రోధావేశాలు, ఎంతటి వారినైనా తృటిలో ఎంతటి అకార్యానికి పాల్పడజేస్తాయో అహంకారం వదిలించుకోవటం ఎంత జటిలమో బోధపడుతుంది.

★





లలితాదేవి ఆలయం



హనుమాన్ ఘరి

సీరియల్

గని

జరిగినకథ:

సుకుమార్ ఓరోజు పరగడుపున గనిలో పనికి వెళతాడు. అక్కడ అతనికి కళ్లు తిరుగుతాయి. దాంతో కాసేపు పడుకుంటాడు. అయినప్పటికీ పనిలో కొదవ లేకుండా జాగ్రత్త పడతాడు. తన పని తాను పూర్తి చేస్తాడు. అయితేనేం అతను విశ్రాంతి తీసుకోవడాన్ని ఇంజనీరు నితాయ్ గమనించి జీతంలో కోతపెడతాడు. ఇలా చేస్తేనే తోటి కార్మికుల కొవ్వు అణుగుతుందని అతని అభిప్రాయం. పూర్తిగా జీతం ఇస్తే తప్ప తీసుకోనని మొండికేస్తాడు సుకుమార్. అతను కుదరదంటాడు. ఇంజనీరు ప్రవర్తనతో నొచ్చుకున్న సుకుమార్‌ను గతస్మృతులు చుట్టుముడతాయి. ఆతర్వాత....

తమిళ మూలం : **కె. చిన్నప్పభారతి**

అనువాదం : **వి. వెంకటేశ్వర**

(ఇరవయ్యవ భాగం)

ఆ గనిలో పనిచేస్తోన్న కార్మికులు నోరులేని జీవాలకు మల్లే కుక్కిన పేనుల్లా పడుండేవాళ్ళు. కార్మికుల ఒంట్లోని శక్తినంతా పీల్చి పిప్పి చేయడం పట్ల యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్టు అనిపించేది. ఒక్కో కార్మికుడు రోజుకి సగటున ఒకటింబావు టన్నుల బొగ్గును తవ్వి తీసి, తొట్టె నింపాలి. అయిదుగురు సభ్యుల జట్టు ఆరుంబావు టన్నుల్ని తవ్వి తీయాలి. అయితే యాజమాన్యం వారు తూకంలో మోసం చేసి పదిటన్నులు రాబట్టుకొనేవాళ్ళు. కార్మికులకు ఇవేమీ తెలియవు. వాళ్ళది నోరు మెదపలేని పరిస్థితి. ప్రశ్నించినందుకు మారుగా ఉద్యోగం పోయినా ఫరవాలేదు, ప్రాణాలు పోయేవి! రేపటికి తిండి ఎట్లన్న చూపు తప్ప మరే ఆలోచనా లేని అమాయక చక్రవర్తులు వాళ్ళు.

ఓ మారు, చిన్న డైనమైట్ పేల్చి, బొగ్గు దిబ్బను చీల్చుతుండగా నీరు చిమ్ముకొచ్చింది. దాన్ని వెంటనే మూసివేయకపోతే పెద్ద చీలిక ఏర్పడి జల ప్రవాహం గనిలో ఉన్న వాళ్ళందర్నీ ముంచెయ్యడం ఖాయం. ఓ కార్మికుడు ఆ తూముకేసి తన శక్తిమేరకు బలంగా వీపు ఆనించి నిలుచున్నాడు. కార్మికులు కొయ్య పలకలు తీసుకొచ్చారు. ఇంతలో మరో సమస్య వచ్చి పడింది. కార్మికుడు, అడ్డగించిన తూము పక్కనే మరోచోట కూడా నీటి ఊట మొదలైంది. కార్మికుడు పక్కకు జరిగితే చాలు, నీటి వేగానికి గోడలో పెద్ద చీలిక ఏర్పడుతుంది. దీన్ని గ్రహించిన ఇంజనీరు, ఆ కార్మికుడి మీదే చెక్క పలకలు పేర్చమని ఉత్తర్వు జారీ చేశాడు. సిలువెక్కిన క్రీస్తులా ఆ కార్మికుడు గోడకు అతుక్కుపోయాడు. మారుమాట్లాడలేని పరిస్థితిలో, సహకార్మికుడి పట్ల సానుభూతి కలిగిన కార్మికులు గుండె రాయి చేసుకొని ఆ పని నిర్వర్తించారు. తాను పక్కకు జరిగితే గని మొత్తం నీటిలో మునిగిపోక తప్పదని గ్రహించిన కార్మికుడు గనిని, సహకార్మికుల్ని కాపాడడం కోసం ప్రాణత్యాగం చేశాడు.

అయితే గని యజమాని ఆ విషయాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదు. "మిగతా కార్మికుల్ని కాపాడడం కోసం వాడు ప్రాణాలు పణంగా పెట్టాడు. గోడకు కరచుకుపొమ్మని నేను చెప్పలేదే! అతడి కుటుంబాన్ని నేనెందుకు ఆదుకోవాలి? ఏనుగు ఉన్నా వెయ్యి వరహాలు, చచ్చినా వెయ్యి వరహాలు. గని కూడా ఏనుగు లాంటిదే... అసలు ఈ గని బొగ్గు నిలువ తగ్గిపోయింది. ఇది పాడయిపోతే బీమా డబ్బులతో కొత్త గని కొనుక్కొంటాను...."

అతడు క్షణం సేపు ఆగి, మళ్ళీ కొనసాగించాడు.

"అతడి చావు వల్ల బతికి బట్ట కట్టిన కార్మికులందరూ తమ జీతంలో కొంతభాగం విరాళంగా ఇచ్చి అతడి కుటుంబాన్ని ఆదుకోవడం న్యాయంగా ఉంటుంది. మీరు ముందుకొస్తే, విరాళాలు సేకరించే బాధ్యత నేను తీసుకొంటాను. నా గనిలో పనిచేసిన కార్మికుడి కోసం ఆ మాత్రం చేయకుండా ఉంటానా?" కార్మికుడితో తనకేమీ సంబంధం లేనట్టు నిర్లక్ష్యంగానూ, అహంకారంతోనూ మాట్లాడాడు.

ఈ ఘటన చూసి మ్రాన్పడిపోయిన సుకుమార్ తాను ఇలాంటి కసాయి దగ్గర ఇక పని చేయలేనని రాత్రికి రాత్రి తట్టాబుట్టా సర్దుకొని వచ్చేశాడు.

స్మృతి శకలాలు కరిగిపోయాయి. వర్తమానంలోకి వచ్చాడు. "పెనం మీంచి పొయ్యితో పడినట్టుంది పరిస్థితి. చేసిన పనికి కూలి అడగడం నేరమవుతుందా? ధన్‌బాద్ గనిలో పదుగురి కోసం ఒక్కడు ప్రాణత్యాగం చేశాడు. ఇక్కడ వున్నట్టు కార్మిక సంఘంగానీ, హక్కులు, పోరాటం గానీ లేని తరుణంలో అతడెంత ఉన్నతంగా ఆలోచించగలిగాడు! ఇప్పుడు మనం జీతంలో విధించిన కోత గురించి నోరు తెరిచి ప్రశ్నించడానికి ఎందుకు తటపటాయించాలి?" మాట్లాడాడు.

ప్రశ్నించడమే నేరం కావడంతో అతడ్ని సస్పెండు చేసింది యాజమాన్యం. అప్పుడు బికాస్ అక్కడ లేకపోవడంతో, తన జట్టులో పనిచేసే సుకుమార్‌కు జరిగిన అన్యాయం గురించి చర్చించడం కోసం అతడ్ని వెంటబెట్టుకొని జనరల్ మేనేజర్ వద్దకు వెళ్ళాడు. జరిగిన దాన్ని గురించి బికాస్ వివరించాడు. మబ్బు తెరల్ని చీల్చుకొచ్చే సూర్యకిరణాల్లా దీప్తిమంతంగా ఉన్నాయి అతడి మాటలు. "మునుపెన్నడూ లేని విధంగా ఓ కార్మికుడు తనకు అన్యాయం జరిగిందని చెబుతున్నాడంటే వాడికెన్ని గుండెలు ఉండాలి" అనుకొన్నాడు జనరల్ మేనేజర్.

"వ్యాపారంలో ఎన్ని కష్టనష్టాలు ఉన్నాయో కార్మికులకు అర్థం కాదు. మందు కొట్టడానికి డబ్బు లేకపోతేనో, కూరగాయలూ, చేపలూ కొనడానికి డబ్బు లేకపోతేనో వాళ్ళు తట్టుకోలేరు. వాళ్ల దుబారా ఖర్చుల్ని సైతం యాజమాన్యమే భరించి,

గనిని ఓ ధర్మసత్రంలా నడుపుతోంది. పస్తు పడుకోనవసరం లేకుండా అయిదువేళ్ళూ నోట్లోకి పోతోంది కదాని సంతోషించరు. ఎన్ని వ్యయప్రయాసల్ని ఓర్చుకొని యాజమాన్యం గనిని నిర్వహిస్తోందని వాళ్ళెప్పుడైనా ఆలోచించారా?" ముందుచూపుతో పొరపాటున కూడా నిజం మాట్లాడకూడదని ఒట్టుపెట్టుకొన్నట్లు మాట్లాడుతున్నాడు జరనల్ మేనేజర్.

అసలు సమస్య పక్కదారి పడుతోందని గ్రహించాడు చంచల్ కుమార్! 'జరిగిన దాని గురించి ప్రస్తావించకుండా, డొల్లమాటలు మాట్లాడి చేతులు దులుపుకోవాలని ప్రయత్నిస్తున్నాడు" అని విసుక్కొన్నాడు. సిబ్బందికి కలుగుతోన్న ఇబ్బంది గురించి అతడు పైఅధికారులకు నివేదించగలడే గాని దుశ్చర్యల్ని దుయ్యబట్టగలడా? ఒంటరిగా నిలచి పోరాడిన వాళ్ళంతా సోదిలోకి రాకుండా పోయారు. అతడు కోరిందల్లా ఒకటే. సుకుమార్ చర్యను సహృదయంతో స్వీకరించమని. "అతడు ఏ తప్పు చేయలేదు. కాసేపు కునుకు తీసినా యాజమాన్యం వారికి నష్టం కలిగించలేదు. ఇకపై ఇలా కునుకుతీయడు" అని చెప్పదలచాడు చంచల్ కమార్. అయితే జనరల్ మేనేజరు గని తాలూకు ఖర్చులు గురించి ఏకరవు పెడుతూ పొదుపు ఆవశ్యకతను నొక్కి వక్కాణిస్తున్నాడు. కార్మికులు గొంతెమ్మ కోరికలు కోరుతున్నారన్నట్టు గోరంతలు కొండంతలు చేసి మాట్లాడుతున్నాడు. కార్మికులకు పేగులే ఉండకూడదనీ, నాలుకే ఉండకూడదనీ భావిస్తారు కాబోలు! అప్పుడే కదా ఏ కోరికలూ కోరరు!

"అయితే కార్మికుల్ని పస్తులు పెట్టి, వాళ్ళ డొక్కల్ని మాడ్చిన మాట నిజం! అందుకేనేమో పొదుపు గురించిన ఉద్బోధ!' అనుకొన్నాడు చంచల్ కుమార్, పైకి వెల్లడించలేకపోయినా.

ఇక ఊరుకుంటే లాభం లేదని భావించిన జనరల్ మేనేజర్ "ఇలా పనివేళలో నువ్విక్కడకి వచ్చి నిలబడడమే గని నియమ నిబంధనలకు వ్యతిరేకం. పైపెచ్చు యూనిఫారంతో వచ్చి నిలుచున్నావు. ఇదొక్కటే చాలు. నిన్ను సస్పెండు చేయడానికి" అన్నాడు తాను అతడి మంచి కోరుతున్న ధోరణిలో.

తాను తప్పు చేసిట్టు గ్రహించాడు చంచల్ కుమార్. నిబంధనల ప్రకారం అధికారుల అనుమతి లేనిదే బయటికి రాకూడదు. పైపెచ్చు తాను యూనిఫారంతో వచ్చేశాడు. దీన్నే నేరంగా పరిగణించి, శిక్షించవచ్చు. మేకపిల్లను పట్టుకోవ్డడానికి పొంచి ఉన్న నక్కలా 'చంచల్ కుమార్ నోట్లోంచి ఏదైనా మాట వెలువడనీ, కట్టడి చేద్దాం' అని ఎదురుచూస్తున్నట్టు ఉన్నాడు జనరల్ మేనేజర్. అతడి మాటల్లో కపటత్వం ఉంది. అతడి తీక్షణమైన చూపులు అతడి కపటత్వాన్ని వెల్లడి చేస్తున్నాయి. గాలీ వెలుతురూ చొరబడని రాతి గుహ లాంటి అతడి చిత్తం ఎవరూ అర్థం చేసుకోలేరు. బికాస్ వచ్చేదాకా ఆగిఉంటే సంఘం ద్వారా ప్రస్తావించి ఉండవచ్చు. ఇలా భావిస్తూ "తమరు దయ తలచాలి..." అని ఏదో చెప్పబోతున్నంతలో.

"నీకివాళ కూలి లేదు.. పో! ఇంకా నిలుచుంటే సస్పెండు చేస్తా!" అని కటువుగా చెప్పాడు జనరల్ మేనేజరు. చేతిలో ఉన్న వస్తువు కంచో, ఇత్తడో పరిశీలిస్తున్నట్టు దాన్ని ఎత్తిపట్టుకొని మొహం దగ్గర పెట్టుకొని చూస్తూ మాట్లాడుతున్నాడు.

మారుమాట్లాడకుండా వెనుదిరిగారు చంచల్ కుమార్, సుకుమార్. చనిపోయిన రోగి జేబులో చెయ్యి పెట్టి వెతికే వైద్యుడి బారిన పడినట్టుగా ఉంది వాళ్ళ పరిస్థితి. అతడు కళ్ళు మూసి తెరిచాడు. నడక వేగం హెచ్చింది. అతని వేగానికి అనుగుణంగా కదులుతోంది గడ్డం. మనసు లోపల అతడు ఎవరినో తిట్టుకొంటున్నాడు. నుదుటి మీంచి కనురెప్పలపై జారుతోన్న చెమటను అరచేత్తో తుడుచుకొంటున్నాడు. కనురెప్పల చాటు నుంచి అధికారుల విలాసవంతమైన గదుల్ని పరికించాడు. తమ ఎముకలు పునాదులుగా లేచిన శవాల గిడ్డంగిలా ఉందనుకొన్నాడు. తీవ్ర భావావేశానికి లోనయినప్పుడే అతడి కనురెప్పలు టపటపా కొట్టుకొంటాయి.

ఎక్కడో విరబూసిన గోరింట పూలు, మధుమాలతీ పుష్ప పరిమళమూ గాలిలో తేలి వస్తున్నాయి. ఉదయపు ఆహారం కింద కాస్తోన్న గంజి తాలూకు ఆవిరి మనసును కట్టి పడేస్తోంది. వంటింటి ఆవిరిలాగానే కార్మికుల హృదయాలు కూడా కుతకుతలాడుతున్నాయి.

అఖిలభారత గని కార్మిక సంఘాల సమాఖ్య సమావేశం జరిగింది. ఆ సమావేశానికి బికాస్ చౌదరి, దిలీప్ పాశ్వన్ హాజరయ్యారు. ఆ సమావేశానికి కీలక నిర్ణయాలు తీసుకొన్నారు.

"బొగ్గు గనులన్నీ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉండడం వల్ల భారతదేశపు పారిశ్రామికాభివృద్ధికీ, విద్యుదుత్పత్తికీ ఆటంకం కలుగుతోంది. అందువల్ల బొగ్గు గనులన్నిటినీ జాతిపరం చేయాలి. అలా చేసిన పక్షంలో పండగలకు సెలవులు, గృహ వసతి వంటి సదుపాయాలు లభిస్తాయి. కార్మికుల జీవితాలు మెరుగవాలంటే గనుల్ని జాతిపరం చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ చట్టం రూపుదిద్దుకోవడం కోసం కార్మికులు ఉద్యమించాలి. పెద్ద ఎత్తున దీన్ని గురించి ప్రచారం చేయాలి, సమ్మె కట్టాలి.

"కార్మికులు గనులలో ఎదుర్కొనే రోజువారీ సమస్యల్ని కూడా ఉద్యమంలో అంతర్జాతీయంగా భావించాలి. మనం మాత్రమే పోరాడి సాధించుకోలేం. కనుక సామాన్య ప్రజల మధ్య అవగాహన కలిగించినవాళ్ళ మద్దతును కూడగట్టుకోవాలి. గనుల కోసం కైంకర్యం చేసుకొనే పొలాలకు నష్ట పరిహారం చెల్లించడం లేదు. ఆయా పొలాల స్వంతదారులకు గానీ, వారి వారసులకు గానీ ఉద్యోగం ఇవ్వడం లేదు. మనం ఒక్క తాటి మీద నిలవాలి. గనుల్ని జాతిపరం చేయాల్సిన అవసరం ఉందని సామాన్య ప్రజలు భావించేలా చేయగలగాలి" అన్నాడు బికాస్.

ఈ విషయం చెవిన పడగానే కార్మికులంతా ఎగిరి గంతేశారు. అయితే, ఇది సులభసాధ్యమైన పనేనా? మనకు అంత బలం ఉందా? మామూలు వడ్డీ వ్యాపారులు పెట్టే హింసనే భరించలేకపోతున్నాం. గనుల్ని జాతిపరం చేయాలని మనం కోరినంతమాత్రాన అది జరుగుతుందా? ప్రభుత్వానికే ఇలాంటి ఆలోచన రాలేదు, మనకు వస్తే సాధ్యమవుతుందా? మనమనగా ఎంత? గనుల్లో పోరాడే పురుగుల్లాంటి వాళ్ళం. వెన్నెముకల్లేని పురుగుల్లాగానే మనం పరిష్కరించుకోలేని పరిస్థితిలో, పొలాలు కోల్పోయే రైతుల సమస్యను కూడా చేపట్టి పోరాడాల్సిన అవసరం ఏముంది? మన అవసరాల గురించి చర్చించడానికి వెళ్ళినప్పుడు గూండాలను పంపించి చితక్కొట్టారు. మనం ఏమైనా చేయగలిగామా?" ఇలా అనేక ప్రశ్నలు, సందేహాలు లేవనెత్తారు.

బికాస్‌కు ఇది కొత్తేమీ కాదు. పల్లెల్లో ఏది దొరికితే అది ఒక పూటో, రెండు పూటలో తింటూ దేవుడి మీద భారం వేసి బతుకు వెళ్ళదీసే మనుషులు, ఈ ఇంటి కోడి ఆ ఇంటి చూరుమీదికెక్కిందనో, ఒక ఆవు మరొకడి పొలంలో మేసిందనో ఒకరినొకరు కొట్టుకొని పోలీసుల చుట్టూ న్యాయస్థానాల చుట్టూ తిరుగుతూ ఇల్లు గుల్ల చేసుకొనే మనుషులకు దేన్ని చూసినా భయమే. ఎవర్ని చూసినా అపనమ్మకమే. ఈ గనుల్లో పనిచేయడానికి వచ్చేవాళ్ళు అలాంటి గ్రామీణులే. యంత్రభూతాల కోరలు తోమీ తోమీ దగా పడుతున్న అమాయకులు. కొత్త కొత్త యంత్రాలు ఆర్జించి పెడుతోన్న లాభమంతా తమ శ్రమ ఫలితమేనన్న అవగాహన లేనివాళ్ళు. ఒకవేళ అలాంటి అవగాహన కలిగినా, గ్రామీణ సంస్కృతిలో తరతరాలుగా జీర్ణించుకుపోయిన అణిగి ఉండే తత్వం భయం -ఇవే కనిపిస్తాయి వాళ్ళలో" అనుకొన్నాడు మనసులో. ఒకానొక విషాద సంఘటన వల్ల కొందరు ఆత్మ విశ్వాసం కోల్పోతే, మరికొందరు సరికొత్త చైతన్యంతో కార్యోన్ముఖులవుతారు. సరైన మార్గదర్శకత్వమూ, ఉద్యమస్ఫూర్తి వల్ల కలిగే మనోస్థైర్యమూ, అనుభవజ్ఞానం ద్వారా ఏర్పడే అవగాహనా దీన్ని నిర్దేశిస్తాయి. అవగాహన కలిగిందా, ఇక వాళ్ళనెవరూ అడ్డుకోలేరు" అని తలపోశాడు.

(ఇంకావుంది)

చేసేద్దాం

కోడిపుంజు కావాలా



హాయ్ పిడుగులూ! పైన ఉన్న కోడి పుంజు బొమ్మ చాలా బాగుంది కదూ. దీన్ని ఎలా చేశారబ్బా అనుకుంటున్నారా? చాలా సింపుల్ తెలుసా!

ఏమేం కావాలంటే...

ఊలు దారం రెండు మూడు రంగుల్లో తీసుకోవాలి. ఇంకా ఒక మందపాటి అట్టముక్క, ఫెవికాల్, పెన్సిల్.

ఎలా చేయాలంటే...

ఒక మందపాటి అట్టముక్కను తీసుకోండి. దానిమీద పెన్సిల్‌తో కోడిపుంజు బొమ్మను గీసుకోవాలి. ఇప్పుడు రంగుల ఊలును తీసుకుని గీసుకున్న కోడిపుంజు బొమ్మమీద జాగ్రత్తగా ఫెవికాల్‌తో బొమ్మలో చూపిన విధంగా అతికించుకోవాలి. ఇక్కడ మీకు నచ్చిన రంగుల ఊలును పెట్టుకోవచ్చు. ఇలా ఒక్క కోడిపుంజు బొమ్మనే కాదు, వేరే ఏ జంతువునైనా, పక్షినైనా చేసుకోవచ్చు. ఇది బాగా ఆరే వరకు కదిలించకుండా వుంచితే ఊలు జరగకుండా వుంటుంది. తర్వాత ఒక పాలిథిన్ కవర్‌లో ఈ బొమ్మ పెట్టేస్తే చక్కటి ఫ్రేం తయారవుతుంది. దీన్ని చక్కగా హాల్లోనో, డ్రాయింగ్ రూంలోనో గోడకు పెట్టి చూడండి. ఎలా వుంటుంది. ఇక వచ్చిన వారందరూ దాన్ని ఎలా చేశారు? అని అడగాల్సిందే.... కాదంటారా చెప్పండి.



జాలరి ఎక్కడ?

నేస్తాలూ! పైన మూడు చేపలు ఉన్నాయి కదా. అయితే జాలరి కూడా అక్కడే దాక్కుని వున్నాడు. ఇంతకీ అతనెక్కడున్నాడు?

రంగులేసేద్దాం

తేడాలు కనిపెడదాం

పిల్లలూ... పక్కనున్న రెండు బొమ్మల్లో కొన్ని తేడాలున్నాయి. అవేంటో చూసిన వెంటనే మీరు కనిపెట్టేయాలి మరి. సరేనా.



ఆకు పక్షి

హాయ్ నేస్తాలూ! ఈ వారం మీకోసం పక్షి బొమ్మ తీసుకొచ్చాం చూశారుగా. మీరు కూడా ఇలాంటి ఆకారాలున్న ఆకులు తీసుకుని తయారు చేయండే.



దారి చెప్తే పోలా!

ఒకేలా వున్నవేంటి?

పిడుగులూ... ఈ బొమ్మని చూశారా. చాలా బాగుంది కదూ. అయితే ఇది తొమ్మిది భాగాలుగా ఉంది. వాటిలో రెండు భాగాలు ఒకేలా వుంటాయి. అవేంటో కనిపెడతారుగా.





నేర్చుకుందాం

జవాబులు

మనిషి ఎక్కడ?: పుస్తకాన్ని తిప్పి చూడండి. రెండు చేపల మధ్య జాలరి తల వుంది.

ఒకేలా వున్నవేంటి?: 1A, 3B

తేడాలు కనిపెడదాం?
1. గోడ గడియారంలోని ముల్లు, 2. కబోర్డులోని బొమ్మలు, 3. టేబుల్‌మీద అరటిపండు, 4. తాత తలమీది టోపీ, 5. అబ్బాయి కాలి సాక్సు, 6. అబ్బాయి మూతి, 7. ట్రేలో వస్తువులు, 8. తాత కట్టుకున్న టై.

అట్టమీది కథ



టెన్నిస్ రారాజు రోజర్

"ఇంకా కొన్నేళ్లపాటు టెన్నిస్ ఆడగల సత్తా నాలో ఉంది. గాయాలకు గురికాకుండా మరికొన్ని గ్రాండ్‌శ్లామ్ టైటిల్స్ సాధిస్తాను"

15వ గ్రాండ్‌శ్లామ్ టైటిల్ సాధించగానే రోజర్ ఫెడరర్ చేసిన వ్యాఖ్య ఇది. అత్యధిక గ్రాండ్‌శ్లామ్ టైటిళ్లు సాధించి పీట్ సంప్రాస్ రికార్డును బద్దలు కొట్టినప్పటికీ అతడిలో విజయదాహం ఏమాత్రం తగ్గలేదనడానికి పై వ్యాఖ్యలే నిదర్శనం. 2003లో వింబుల్డన్ టైటిల్ సాధించడం ద్వారానే తొలి గ్రాండ్‌శ్లామ్ విజేతగా నిలిచిన రోజర్ జైత్రయాత్ర అప్పటి నుండి నిరాటంకంగా సాగుతోంది. ఫెడరరే టెన్నిస్... టెన్నిసే ఫెడరర్ అనేంతగా కలిసిపోయింది. ప్రపంచ టెన్నిస్‌ను ఐదేళ్లుగా ఏకఛత్రాధిపత్యంగా ఏలుతున్న ఫెడరర్ 15వ గ్రాండ్‌శ్లామ్ టైటిల్ సాధించిన ఏకైక ఆటగాడిగా నిలిచి ఆల్‌టైమ్ రికార్డు నెలకొల్పాడు. ఇటీవల జరిగిన వింబుల్డన్ ఫైనల్లో ఆండీ రాడిక్‌ను మట్టికరిపించి టెన్నిస్‌లో మకుటం లేని మహారాజుగా నిలిచాడు. ఇతని జైత్రయాత్ర తీరుతెన్నులు...జీవిత విశేషాలు ఈ వారం అట్టమీది కథలో...

- ఇంజమాముల్ షరీఫ్

ఫెడరర్ కుటుంబం జర్మనీలోని బవారియా ప్రాంతం నుండి స్విట్జర్లాండ్‌కు వలస వచ్చింది. బవారియా ప్రాంతంలో నివసించిన కొన్ని కుటుంబాలకు ఫెడరర్ అనే ఇంటిపేరు ఉంది. రోజర్ ఫెడరర్ స్విట్జర్లాండ్‌లోని బసెల్ నగర సమీపంలో గల బిన్నింగెన్ గ్రామంలో జన్మించాడు. అతడి తండ్రి జర్మనీ నుండి వలస వచ్చిన రాబర్ట్ ఫెడరర్ సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. తల్లి దక్షిణాఫ్రికా జాతీయురాలు లైనెట్ డ్యూరాండ్. బసెల్‌కు సమీపంలో గల ఫ్రాన్స్, జర్మనీ సరిహద్దు నగరమైన మాంచెన్‌స్టీన్‌లో పెరిగాడు. ఆరేళ్ల ప్రాయంలోనే టెన్నిస్ పట్ల ఆసక్తి పెంచుకున్నాడు. అప్పటి నుండి టెన్నిస్‌ను క్రమం తప్పకుండా ప్రాక్టీసు చేశాడు. పన్నెండేళ్ల వయస్సు వరకు ఫుట్‌బాల్ కూడా ఆడేవాడు. పద్నాలుగేళ్ల వయస్సులోనే అన్ని ఏజ్ గ్రూపుల్లో జాతీయ ఛాంపియన్‌గా నిలవడం విశేషం. దీంతో స్విస్ నేషనల్ టెన్నిస్ సెంటర్‌లో శిక్షణ పొందే అరుదైన అవకాశాన్ని పొందాడు. ప్రొఫెషనల్ ఆటగాడిగా మారి జులై 1996లో ఐటిఎఫ్ జూనియర్ టెన్నిస్ సర్క్యూట్‌లో చేరాడు. చదువులోనూ రాణించి పదహారేళ్ల ప్రాయంలోనే జర్మనీ, ఫ్రెంచ్ భాషలతో సహ ఇంగ్లీషు కూడా అనర్గళంగా మాట్లాడే సత్తా సంపాదించాడు. అప్పుడు ఆటను తగ్గించి చదువుకు ప్రాధాన్యతనివ్వాలా? లేక టెన్నిస్‌లోనే కొనసాగాలా? అనే ప్రశ్న అతని ముందుకొచ్చింది. స్విట్జర్లాండ్ జాతీయ టెన్నిస్ సెంటర్‌లో సీరియస్‌గా శిక్షణ తీసుకుంటే ప్రపంచ ఛాంపియన్‌గా గుర్తింపు సంపాదించవచ్చని స్నేహితులు, శ్రేయోభిలాషులు ప్రోత్సహించారు. తనకూ చదువంటే పెద్దగా ఆసక్తి లేదు. దీంతో తనకిష్టమైన టెన్నిస్ కోసం చదువుకు గుడ్‌బై చెప్పాడు. ఒక్క ఏడాదిలోనే అద్వితీయమైన ప్రతిభ కనబర్చి 1998లో జూనియర్ వింబుల్డన్ విజేతగా నిలిచాడు. అదే ఏడాది వరల్డ్ జూనియర్ టెన్నిస్ ఛాంపియన్ ఆఫ్ ద ఇయర్‌గా కూడా గుర్తింపు సాధించాడు. 1998లో సీనియర్ ఆటగాడిగా మారాడు. తొలి ఎటిపి విజయాన్ని 2001లో సొంతం చేసుకున్నాడు. అప్పటినుండి అతడి జైత్రయాత్ర కొనసాగుతోంది.

ఫెడరర్ X నాదల్

టెన్నిస్‌లో రోజర్ ఫెడరర్, రాఫెల్ నాదల్‌లను దాయాదులుగా పిలుస్తారు. పురుషుల సింగిల్స్‌లో హోరాహోరీగా సాగేది వీరిద్దరి మధ్య జరిగే మ్యాచే. వారి మ్యాచ్ నిజమైన టెన్నిస్‌ను వీక్షించేందుకు దోహదపడుతుంది. 2004 నుండి ముఖాముఖి తలపడుతున్నారు. జులై 2005 నుండి వీరిద్దరే తొలి రెండు ర్యాంకుల్లో ఉన్నారు. నాలుగేళ్ల పాటు మొదటి రెండు ర్యాంకుల్లో నిలిచిన ఏకైక జంట వీరిదే. ఫెడరర్ ఏకంగా 237 వారాల పాటు నెంబర్ వన్ ర్యాంకులో కొనసాగాడు. ఫెడరర్ కంటే ఐదేళ్లు చిన్నవాడైన నాదల్ జులై 2005 నుండి రికార్డు స్థాయిలో 160 వారాల పాటు నెంబర్ టూగా కొనసాగాడు. చిట్టచివరికి ఆగస్టు 2008లో ఫెడరర్‌ను రెండో ర్యాంక్‌కు నెట్టేసి నెంబర్ వన్‌గా అవతరించాడు. అయితే ఇరువురు ముఖాముఖిగా 19 సార్లు తలపడగా నాదల్ విజయాల రికార్డు 13-6గా ఉంది. అందులో ఇద్దరూ 15 సార్లు ఫైనల్లోనే తలపడటం విశేషం. అందులోనూ ఏడుసార్లు గ్రాండ్‌శ్లామ్ ఫైనల్లోనే తలపడటం ఆల్ టైమ్ రికార్డు. 2006-208 మధ్య కాలంలో ఆ ఇద్దరు ఆటగాళ్లు ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ ఓపెన్ ఫైనల్స్‌లో తలపడ్డారు. 2009 ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లోనూ తలపడ్డారు. తొలి రెండు వింబుల్డన్ ఫైనల్స్‌లో ఓడిపోయిన నాదల్ తదుపరి ఐదు మ్యాచ్‌ల్లో గెలిచాడు. 2008 వింబుల్డన్ ఫైనల్ టెన్నిస్ చరిత్రలోనే దీర్ఘకాలం నడిచిన మ్యాచ్‌గా నిలిచింది. ఏడు మాస్టర్స్ సీరస్ ఫైనల్స్‌లోనూ తలపడ్డారు. రోమ్ మాస్టర్స్ సిరీస్-2006లో వీరి ఫైనల్ మ్యాచ్ ఏకంగా ఐదు గంటల పాటు సాగడం గమనార్హం.

వ్యక్తిగతం

జన్మస్థలం : బసెల్, స్విట్జర్లాండ్
పుట్టినతేది : 8 ఆగస్టు 1981
నివాసం : వోలేరో, స్విట్జర్లాండ్
ఎత్తు : 6 అడుగుల 1 అంగుళం
బరువు : 85 కిలోలు
నిక్‌నేమ్ : రోజి, స్విస్ మిస్ట్రో, ఫెడరర్ ఎక్స్‌ప్రెస్,
ఆట : రైట్ హ్యాండ్, వన్ హ్యాండెడ్ బ్యాక్‌హ్యాండ్
కెరీర్ ప్రయిజ్ మనీ : 49,475,219 డాలర్లు (సింగిల్స్‌లో అత్యధిక పారితోషికం పొందిన ఆటగాడు)
విజయాల రికార్డు : 657-155 (80.9 శాతం)
టైటిళ్లు : 60
ర్యాంకు : నెంబర్ వన్ (2 ఫిబ్రవరి 2004 నుండి)
గ్రాండ్‌శ్లామ్ సింగిల్స్ టైటిళ్లు : ఆస్ట్రేలియా ఓపెన్ (2004, 06, 07), ఫ్రెంచ్ ఓపెన్ (2009), వింబుల్డన్ (2003, 04, 05, 06, 07, 09), యుఎస్ ఓపెన్ (2004, 05, 06, 07, 08)
డబుల్స్ టైటిల్ : 2008 ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం
రికార్డులు : వరుసగా 237 వారాల పాటు నెంబర్ వన్ స్థానంలో కొనసాగడం, ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ టెన్నిస్ ప్లేయర్, పురుష ఆటగాళ్లలో అత్యధిక గ్రాండ్‌శ్లామ్ టైటిళ్లు (15) సాధించడం, గ్రాండ్‌శ్లామ్ సాధించిన (ఒకే ఏడాది నాలుగు గ్రాండ్‌శ్లామ్ టైటిళ్లు) ఆరుగురు ఆటగాళ్లలో ఒకడు, వరుసగా 20సార్లు గ్రాండ్‌శ్లామ్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. వరుసగా 10 గ్రాండ్‌శ్లామ్స్‌లో ఫైనల్‌కు చేరుకున్నాడు. లారియస్ వరల్డ్ స్పోర్ట్స్‌మన్ ఆఫ్ ద ఇయర్ అవార్డును వరుసగా నాలుగేళ్లపాటు (2005-08) సాధించాడు. స్విట్జర్లాండ్ ప్రభుత్వం ఫెడరర్‌పై ప్రత్యేక స్టాంపును విడుదల చేసింది.
ఇతర ఆటల పట్ల ఆసక్తి : ఫుట్‌బాల్
కోచ్ : ఫెడరర్‌కు టోనీ రాచ్ (ఆస్ట్రేలియా టెన్నిస్ మాజీ ఛాంపియన్) 2005 నుండి కోచ్‌గా వ్యవహరిస్తున్నారు.
హాబీలు : సాకర్, డబ్ల్యుడబ్ల్యుఎఫ్, సినిమాలు, చేపల వేట, స్కీయింగ్.
ఇష్టమైన రంగు : నీలం, ఎరుపు, తెలుపు
ఇష్టమైన ఆటగాళ్లు : ఎఫ్‌సి బసెల్, జినెదిన్ జిదానే, ఫ్రాన్సిస్కో టోట్టి, మైకేల్ జోర్డార్, లెనాక్స్ లెవిస్, పీటర్ ఫోర్స్‌బెర్గ్.
మర్చిపోలేని సరదా ఘటన : 14 ఏళ్ల ప్రాయంలో బసెల్‌లో మార్కో అనే స్నేహితుడితో టెన్నిస్ ఆడుతున్నాడు. ఆరు గంటలవుతోంది. ఒక పక్షి నెట్‌పైకి వచ్చి వాలింది. స్నేహితుడు దాన్ని చూడకుండా సర్వీసు చేశాడు. "ఆగు! ఆగు!!" అని రోజర్ అరిచేలోపే బంతి వేగంగా వచ్చి పక్షిని తగిలింది. అది ఎగిరి ఇతని వైపున మైదానంపై పడి గిలగిలా కొట్టుకొని కళ్లముందే చనిపోయింది. దాని రెక్కలు మైదానమంతా చెల్లాచెదురుగా పడ్డాయి. ఏమైందో స్నేహితుడికి అర్థం కాలేదు. అనూహ్యంగా జరిగిన ఆ సంఘటనను తను ఎన్నటికీ మర్చిపోలేనని రోజర్ ఓ సందర్భంలో చెప్పాడు.

జీవితభాగస్వామి మిర్కా

మహిళా టెన్నిస్ మాజీ క్రీడాకారిణి మిరోస్లావా 'మిర్కా' వావ్రినెక్‌ను పెళ్లి చేసుకున్నాడు. 2000 సిడ్నీ ఒలింపిక్స్‌లో స్విట్జర్లాండ్ తరఫున ఆడుతున్నప్పుడు ఇద్దరూ తొలిసారి కలుసుకున్నారు. 2002లో కాలి గాయం కారణంగా టెన్నిస్‌కు గుడ్‌బై చెప్పిన మిరోస్లావా అప్పటి నుండి ఫెడరర్‌కు పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్‌గా వ్యవహరిస్తోంది. 11 ఏప్రిల్ 2009లో వీరిద్దరు బసెల్‌లో పెళ్లి చేసుకున్నారు. వారికి ఇటీవల కవల కూతుళ్లు (మైలా రోస్, చార్లెన్ రివా) జన్మించారు.

మధుర క్షణాలు మిస్సయ్యా...

ఫెడరర్ తొలి గ్రాండ్‌శ్లామ్ టైటిల్ (వింబుల్డన్) సాధించిన మధుర క్షణాలను అతడి తండ్రి రాబర్ట్ ఫెడరర్ ప్రత్యక్షంగా తిలకించి ఆస్వాదించలేకపోయాడు. కారణమేంటో తెలుసా...? ఆ సమయంలో రాబర్ట్ తన పెంపుడు పిల్లికి భోజనం పెడ్తున్నాడు. రోజర్ ఫైనల్ మ్యాచ్ ఆడుతున్నప్పుడు రాబర్ట్ తన స్వస్థలం స్విట్జర్లాండ్‌లోని ఇంట్లో పెంపుడు జంతువులకు తినిపిస్తూ ఉన్నాడు. అయితే అతడు ఆ మ్యాచ్‌ను టెలివిజన్‌లో తిలకించాడు. "నేను మా ఇంట్లో నా పెంపుడు పిల్లికి ఆహారం పెడ్తున్నాను. అయితే నా స్నేహితులతో కలిసి మ్యాచ్‌ను టెలివిజన్‌లో చూశాను. మేం టెన్నిస్ కుటుంబానికి చెందిన వారం కాదు. అతడ్ని ఆడమని మేమెప్పుడూ అనలేదు. అయితే అతడు టెన్నిస్‌లో ఎదిగిన తీరు మాకందరికీ గర్వకారణం" అని రోజర్ తండ్రి రాబర్ట్ ఫెడరర్ అంటారు.

చిన్ననాటి ఘటన

ఇంట్లో గుండ్రంగా ఉన్న ఏ వస్తువు దొరికినా టెన్నిస్ బంతిగా భావించి కొట్టేవాడు. బ్యాట్‌తో లేదా చెక్కతో ఇంట్లోని కప్‌బోర్డులపై, తలుపులపై, గోడలపై కొట్టేవాడు. ఆ బంతి వెళ్లి ఇంట్లో ఏదైనా వస్తువుకు తగిలి పగిలిపోయేది. ఇంక చెప్పేదేముంది అమ్మతో రోజంతా తిట్లే తిట్లు!


తమిళనాడు వచ్చినప్పుడు
అనాథపిల్లలతో క్రికెట్ ఆడుతూ రోజర్


భార్యాపిల్లలతో...


చిన్నారి రోజర్



సెరీనాతో...

రోజర్ స్టయిల్

ఫెడరర్ తన రాకెట్‌తో బంతిపై సాధించే అదుపు అతడ్ని ప్రపంచ ఛాంపియన్‌గా నిలబెట్టింది. రాకెట్‌ను వేగంగా కదపడం, తిప్పే విధానం, టాప్‌స్పిన్‌లలో కంట్రోల్ సాధించగలడు. ఫలితంగా అతను బంతిని ప్రత్యర్థి కోర్టులో తాను అనుకున్న చోటుకు పంపించగలిగి మ్యాచ్‌పై ఆధిక్యత సాధిస్తాడు. మెంటల్ గేమ్‌ను కూడా అప్పుడప్పుడు ఆడుతూ కంగారు పుట్టిస్తాడు.

సర్వీసు : అతడి సర్వీసు వేగంగా (120 మీ/గం) ఉంటుంది. సర్వీసులో వైవిధ్యం, బౌన్స్ ఆయన ప్రత్యేకత. స్లో మోషన్ ఏస్‌లు సంధిస్తూ ప్రత్యర్థిని కంగారు పుట్టిస్తాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను రిటర్న్ చేయడంలో తెలివి ఉపయోగిస్తాడు. ఆంద్రీ అగస్సీ మాదిరిగా వేగంగా రిటర్న్ చేయడు కానీ, సర్వీసు తీరును పసిగట్టడంలో అతడికంటే దిట్ట. ప్రపంచంలోనే అత్యంత వేగంగా సర్వీసు చేయగలిగే ఆండీ రాడిక్‌కు ఫెడరర్ మాత్రమే దీటైన జవాబిస్తాడు.

ఫోర్‌హ్యాండ్, బ్యాక్‌హ్యాండ్ షాట్స్: ఫోర్‌హ్యాండ్, బ్యాక్‌హ్యాండ్ షాట్లను వేగంగా (100మీ/గం) కొడ్తాడు. ఒంటిచేత్తో బ్యాక్‌హ్యాండ్ షాట్ కొట్టగలిగే అతికొద్ది మంది ఆటగాళ్లలో ఇతడు ఒకడు.

డిఫెన్స్: అగస్సీ మాదిరిగా హాఫ్ వ్యాలీలు, బ్యాక్‌హ్యాండ్ ఫ్లిక్ రిటర్న్‌లకు డిఫెన్సివ్ షాట్స్‌ను సమర్థవంతంగా కొడ్తాడు.

పోస్టల్ స్టాంప్

ఫెడరర్ సాధించిన విజయాలకు గుర్తింపుగా ఏప్రిల్, 2007లో సాధించిన వింబుల్డన్ ట్రోఫీతో ఉన్న అతడి ఫొటోతో స్విస్ ప్రభుత్వం పోస్టల్ స్టాంపును విడుదల చేసింది.

సామాజిక సేవ

ఏప్రిల్ 2006లో యునిసెఫ్ రాయబారిగా నియమితుడయ్యాడు. ప్రపంచవ్యాప్తంగా పేద పిల్లలను ఆదుకోవడమే రాయబారిగా ఆయన బాధ్యత. 2006లో తమిళనాడు వచ్చినప్పుడు సునామీ బాధిత పిల్లలతో కలిసి క్రికెట్ ఆడాడు. ఫెడరర్ పలు ఛారిటీలకు కూడా తనవంతు సహాయం చేశాడు. వికలాంగ పిల్లల సహాయార్థం, వారికి క్రీడల పట్ల ఆసక్తిని పెంచేందుకు 2003లో రోజర్ ఫెడరర్ ఫౌండేషన్‌ను నెలకొల్పాడు. దక్షిణాఫ్రికా పిల్లలను ఆదుకోవడం ఈ ఫౌండేషన్ ప్రధాన ఉద్దేశ్యం. హరికేన్ కత్రినా బాధితులను ఆదుకునేందుకు 2005లో యుస్ ఓపెన్ ఛాంపియన్ షిప్ సందర్భంగా తన రాకెట్‌ను వేలం వేశాడు. 2006లో అతడు యునిసెఫ్ అంబాసిడర్‌గా నియమితుడయ్యాడు. అప్పటి నుండి దక్షిణాఫ్రికాలో, తమిళనాడులోని సునామీ ప్రభావిత ప్రాంతంలో పర్యటించాడు. ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు యునిసెఫ్ తరఫున ప్రజలకు పలుచోట్ల సందేశాలిచ్చాడు.

★

ప్రశంసల జల్లు

రోజర్ ఫెడరర్ 15వ గ్రాండ్‌శ్లామ్ టైటిల్ సాధించిన తర్వాత వచ్చిన ప్రశంసలు కొన్ని...

"రోజర్‌లాంటి కొడుకు ఉండటం మా కుటుంబం చేసుకున్న అదృష్టం."

- రాబర్ట్ ఫెడరర్ (రోజర్ తండ్రి)

"రోజర్‌లాంటి ఆటగాడు లభించడం టెన్నిస్‌కు గౌరవసూచకం. మేం ఎప్పుడూ రోజర్‌నే గమనిస్తున్నాం. అతడు టైగర్ వుడ్స్ మంచి స్నేహితులు. ఆ ప్రాణ స్నేహితుల మధ్య ఒక పోటీ నెలకొంది. ఎవరెక్కువ గ్రాండ్‌శ్లామ్ టైటిల్స్ (టెన్నిస్‌లో రోజర్, గోల్ఫ్‌లో టైగర్ వుడ్స్) సాధిస్తారో చూడాలి."

- రాడ్ లీవర్

"రోజర్ గొప్ప ఛాంపియన్. అతడిప్పుడు 15వ గ్రాండ్‌శ్లామ్ టైటిల్ సాధించాడు. 16వ.. 17వ.. 18వ టైటిళ్లు కూడా సాధించే సత్తా అతడికుంది. ఆ విజయాన్ని నేనిప్పటికీ అతడితో పంచుకుంటున్నానని భావిస్తున్నాను."

- పీట్ సంప్రాస్

"అతడు 15వ టైటిల్ గురించి పెద్దగా ఆలోచించడని అనుకుంటున్నాను. ఎందుకంటే అతడి దృష్టంతా మరిన్ని వింబుల్డన్ టైటిళ్లు సాధించడంపైనే"

- సెవరిన్ లూథి

(స్విట్జర్లాండ్ డేవిస్ కప్ జట్టు కెప్టెన్)

"అతడు 50 ఏస్‌లు సంధించాడు. అదే అతడి విజయ రహస్యం. ఇంత అద్వితీయ ప్రతిభను నేనెవరిలోనూ చూడలేదు"

- లారీ స్టిఫాంకి (ర్యాడిక్ కోచ్)

"సారీ పీట్... అతడ్ని ఆపేందుకు నేనెంతో ప్రయత్నించాను."

- వింబుల్డన్ ఫైనల్లో రోజర్ చేతిలో ఓడిపోయిన తర్వాత ఆండీ రాడిక్

బొప్పాయి హల్వా

కావలసిన పదార్థాలు

బొప్పాయికాయ కోరు - (పచ్చిది) 2 కప్పులు
పంచదార - 1 1/2 కప్పు
నెయ్యి - 1 1/2 కప్పు
జీడిపప్పు - సరిపడా
యాలుక్కాయ పొడి - 1/2 టీ స్పూను
పచ్చ కర్పూరం - కొంచెం

తయారుచేయు విధానం

బొప్పాయి పెచ్చు తీసి శుభ్రంగా కడిగి కోయాలి. గింజలు తీసి మెత్తగా కోరుకొని ఒక గిన్నెలో వేసుకోవాలి. రెండు సార్లు నీళ్లు పోసి పిసికి కడిగి ఒక గిన్నెలో వుంచుకోవాలి.

గిన్నెలో పంచదార, కొంచెం నీళ్ళు పోసి పాకం వచ్చే వరకు ఆగాలి. తర్వాత బొప్పాయి కోరు గట్టిగా పిండి పాకంలో వేయాలి. ఇది బాగా ఉడికి గట్టి పడిన తరువాత నెయ్యి వేసి తిప్పాలి. నేతిలో వేయించిన జీడిపప్పు యాలుక్కాయ పొడి, కర్పూరం వేసి బాగా కలపాలి. తర్వాత ప్లేటులో పోసి సమంగా చేసి ముక్కలుగా కోసుకోవాలి.



పప్పుల పొడి

కావలసిన పదార్థాలు

కందిపప్పు -1 కప్పు
మిరపకాయలు - 2 గుప్పెళ్లు
పెసరపప్పు- 1 కప్పు
వెల్లుల్లిగర్భాలు - 4
శనగపప్పు - 1 కప్పు
జీలకర్ర -1/2 కప్పు
మినప పప్పు - 1 కప్పు
ఉప్పు - సరిపడా

తయారుచేయు విధానము

మిరపకాయలు బాగా వేయించి పక్కన పెట్టుకోవాలి. అలాగే పప్పులన్నీ రాళ్లు లేకుండా శుభ్రంచేసి దోరగా వేయించుకోవాలి. ఇవి అన్నీ కలిపి వేయించి మిక్సీలో వేసుకోవాలి. చివరిగా ఉప్పు, వెల్లిపాయ కూడా వేసి మెత్తగా పొడుంచేసి సీసాలో పోసుకోవాలి. ఈ పొడి అన్నంలోకి, ఇడ్లీలోకి కూడా బాగుంటుంది.



కరివేపాకు కారం

కావలసిన పదార్థాలు

కరివేపాకు రెబ్బలు - 2 గుప్పెళ్ళు, ఎండుమిర్చి - 1 గుప్పెడు
ధనియాలు-1 గుప్పెడు, వెల్లిపాయలు - 10 గర్భాలు
చింతపండు-చిన్న నిమ్మకాయంత, నూనె-2 టీ స్పూన్లు
జీలకర్ర - 2 టీ స్పూన్లు, ఉప్పు - సరిపడా

తయారుచేయు విధానము

కరివేపాకు ఆకులకు కడిగి తడి లేకుండా తుడిచి వేయించి పక్కన పెట్టుకోవాలి. బాండీలో ధనియాలు, జీలకర్ర వేసి దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి. కొద్దిగా నూనె వేసి మిరపకాయలు వేయించుకోవాలి.



వెల్లుల్లిపాయ, చింతపండు, సరిపడా ఉప్పువేసి వేయించి పెట్టుకున్నవన్నీ అందులో వేసి మెత్తగా దంచి సీసాలో పోసి పెట్టుకోవాలి. ఈ పొడి రుచిగా ఉండటమే కాక ఆరోగ్యానికి కూడా మంచిది.

పొట్లకాయ పెరుగు పచ్చడి

కావలసిన పదార్థాలు

పెరుగు - 1 కప్పు, పొట్లకాయ - సగం ముక్క
పెద్ద ఉల్లిపాయ - 1, పచ్చిమిరపకాయలు-4
నూనె-ఒక గరిట, పోపు సామాను - 1 స్పూను
అల్లం - చిన్న ముక్క, ఉప్పు-తగినంత

తయారు చేయు విధానము

పొట్లకాయ శుభ్రం చేసి చిన్న చిన్న ముక్కలుచేసి పెట్టుకోవాలి. ఉల్లిపాయ, పచ్చిమిరపకాయలు, అల్లం కూడా అలాగే సన్నగా ముక్కలు తరిగి పక్కన పెట్టుకోవాలి.

పొట్లకాయ ముక్కలు ఉప్పువేసి పిసికి పెట్టుకోవాలి. బాండీలో నూనెవేసి కాగిన తరువాత పోపువేసుకోవాలి. తరిగి పెట్టుకున్న ముక్కలన్నీ వేసి ఒక నిముషం వేగనివ్వాలి. ఇందులోనే పొట్లకాయ ముక్కలు కూడా వేసి వేగాక దింపాలి. దీన్ని చల్లారిన తరువాత పెరుగులో కలపాలి (వేడిలో కలిపితే పెరుగు నీరవుతుంది).

క్విట్ ఇండియా

- పొత్తూరి సుబ్బారావు

క్విట్ ఇండియా అని మన బాపూ
ఏ ముహూర్తాన పలికాడో
అది మళ్లీ సత్యమవుతున్నదిపుడు

అప్పుడు విదేశీయులను
తరిమికొట్టే సంకల్పాన్ని
తాము నెరవేర్చుకోవడానికి
కష్టపడ్డారు
ఇప్పుడు స్వదేశీయులు
తమ వలస బాటలకు
సై అనటానికే ఇష్టపడుతున్నారు

నాడు బాపు వెనుక పరుగులిడింది
జన సమూహం, దండియాత్రకు
నేడు కన్సల్టెంట్ ఆఫీసుముందు
పడిగాపులు కాస్తున్నది
జన సందోహం
వీసాల దండయాత్రకు

ఊడిగం చేయడానికిష్టపడక
ఉద్యమాలంటూ
ఉన్న ఆస్తులను ఊడగొట్టుకున్నారప్పుడు
ఉన్నతాశయాలు తమవేనని
డాలర్ల వేటలోపడి అక్రమార్జనకు
అర్రులుజాపుతున్నారు నేడు

నేటి బాలలే
రేపటి భావిపౌరులన్న
నినాదమిప్పుడు
నాటి బాలలే
నేటి పరదేశ పౌరులయ్యే
విధానమయ్యింది
స్వాతంత్ర్య సముపార్జనకు
నాడు జనమంతా ఒక్కటై
అగ్రరాజ్యాన్ని ఎదిరిస్తే
స్వతంత్ర దేశాన్ని
సామ్రాజ్య వాదులకప్పజెప్పటానికి
నేటి పాలకులు
తహతహలాడుతున్నపుడు
ఇక నేటి యువత
'క్విట్ ఇండియా' అంటూ
వలసబాటనెందుకు పట్టదు?

★



చీకటి దుఃఖం

- సిహెచ్.మధు

ఇది చీకటి దుఃఖం
దుఃఖాన్ని వర్ణించటానికి వెలుగులేదు
ఇది అమావాస్య దుఃఖం
మనసును శరీరాన్ని ఆవహించిన
అమావాస్య ఇది
జీవితాన్ని సమాజాన్ని దేశాన్ని
ఆవహించిన అమావాస్య ఇది
ఇది అగ్రవర్ణ అమావాస్య
ఇది కోటీశ్వరుల అమావాస్య
ఇది అవినీతి అమావాస్య
ఈ అమావాస్యకు రాజకీయ రంగు పులుముకుంది
ఇది దోపిడీ దారుల అమావాస్య
ఇది పాలకవర్గం సృష్టించిన అమావాస్య
ఇది అమావాస్య దుఃఖం
ఇది చీకటి దుఃఖం
కట్నం కోరల కింద ఓ చెల్లి చితాబస్మమవుతుంది
అప్పు కట్టలేని రైతు వురితాడును ముద్దు పెట్టుకుంటాడు
ఓ చేనేత కార్మికుడు చనిపోతూ
దుఃఖాన్ని కౌగిలించుకుంటాడు
డిగ్రీల చదువు మోసానికి ఓ యువకుడు
కారు చీకట్లలో కన్నీరు కారుస్తాడు
వైద్యం అందక ఓ బాలింత విలవిలా కొట్టుకుని ప్రాణం విడుస్తుంది
అవినీతి చట్టాలు కొత్త రోడ్లు
యాక్సిడెంట్లో చనిపోతున్న ప్రాణాల దుఃఖం
ఇది వ్యవస్థ దుఃఖం
వ్యవస్థ చీకటి దుఃఖం
అమావాస్య నిండుకున్న వ్యవస్థ చీకటి దుఃఖం

★

క్రైమ్ కథ

- యర్నాగుల సుధాకరరావు

ఫోన్ తెచ్చిన తంటా

“ఈరోజు ఒక విశేషం మనింట్లో జరిగింది. అదేమిటో మీకు చెబితేగాని తెలియదు” ఇంట్లోకి వస్తున్న భర్త అనిల్‌కు ఎదురెళ్లిమరీ చెప్పింది రాణి.

ఏంటబ్బా అని ఆలోచిస్తూనే కుర్చీలో కూలబడ్డాడు.అంతలోనే పక్కనే టేబిల్‌మీదున్న కొత్త ల్యాండ్‌ఫోన్ ట్రింగ్ ట్రింగ్‌మంది. ఒక్కసారి అదిరిపడ్డాడు.

“ఇదెప్పుడు పెట్టారు? ఓహ్ నేను వారంక్రితం డబ్బుకట్టాను.చెప్పడం మరిచాను. ఒకప్పటిలా కాదు. ఇలా కడితే అలా ఇచ్చేస్తున్నారు” అంటూ ఉత్సాహంగా రిసీవర్ అందుకున్నాడు.

“రేయ్ నీకేమైనా పాగలా? మూడు రోజుల నుంచి ఫోన్ చేస్తే ఎత్తవు. సరిగ్గా అర్ధరాత్రి వేళకు ఓవర్‌బ్రిడ్జికిందకు వచ్చేయ్ అక్కడ ఈరాత్రి అనుకున్నట్టు వాడిని వేసేద్దాం. ఓకేనా?”

“ఏయ్ ఎవర్నువ్?” గొంతు జీరబోతుండగా అరిచాడు.

“ఏంబే గొంతు మార్చావు. నీపక్కన పోలీసోడు ఎవరైనా ఉన్నాడా? సరే అనుకున్నట్టే వచ్చేయ్. మరో రెండుగంటలు టైముంది. ముగ్గురం కలిసి పని ఒప్పుకున్నాక ఫోన్‌లకు దొరక్కుండా ఛస్తే ఎలారా? పథకం రెడీ అయ్యింది. ముందే బయల్దేరి వచ్చేయ్. మద్యం సీసాలు రెడీ చేశాను. ముగ్గురం కలిసి రెండుపుల్‌లు కొడితేగాని ఆడిని వేయలేం” చెప్పి ఫోన్ పెట్టేశాడు.

రారెత్తిపోయాడు అనిల్. అలా కూర్చుండిపోయి రెండు గ్లాసులు నీళ్ల తాగాడు. “అదేమిటి? ఫోన్ పెట్టాక తొలికాల్ వస్తే సరదా పడక అలా డీలా పడిపోయావేమిటి?” అని భార్య ఖాళీగ్లాసు తీసుకుని ఆశ్చర్యంగా అడిగింది.

విషయం చెప్పాడు.ఆమె కూడా గడగడలాడింది “ఖూనీ చేయడానికి రమ్మంటున్నాడా?కొంపదీసి అలాంటి పనులకు వెడుతున్నావా? నాకు రక్తం చూస్తే కళ్లు తిరుగుతాయ్. అలాంటి పాపపు పనులు చేయవద్దయ్యా!” అనుమానంగా భర్తవైపు చూసింది.

“ఛస్ అవేం మాటలు. నేను చంపేలా కన్పిస్తున్నానా?”

అంతలోనే మరోసారి ఫోన్ మోగింది.

ఈసారి అనిల్ భార్యను ఎత్తమన్నాడు. భయంగానే రిసీవర్ ఎత్తి “హలో ఎవరు?” అంది.

“అరే చోక్రీ! ముందు ఆపాగల్‌గాడికి ఇవ్వు”

“మేము చోక్రీలం కాము మిఠాయిలు అమ్ముకునే వాళ్లం. మాకు ఖూనీలు ఇలాంటి చంపుకోవడాలు చేతకావు.” కొంచెం భయంగానే పెదాలు వణుకుతూనే చెప్పింది.

“అరెచుప్!మజాక్ బందకరో!!అరే బిల్లీదాదా అంటే ఏమను కున్నావు.ఆబద్మాష్‌కు ఇవ్వు.ఏమిరా నీకేమైనా పాగలయ్యిందా?చేతిలో మస్తుగా డబ్బువస్తాది.అదెవతో మిఠాయిపిల్లతో ఏమిరా పరాచికాలు? అరే ఛల్ పదినిముషాల్లో నాముందు వాలాలా. నీగ్లాసులో విస్కీపోసి ఉంచిన వచ్చేయ్‌రా” దాదాగద్దింపుకు ఆమె రిసీవర్ ఇవ్వడం చివరి మాటలు అనిల్ వినడంతో ఇద్దరికి చెమటలుపోసి నేలమీద కూర్చుండి పోయారు. చేష్టలుడిగిపోయారు.

మరో రెండుసార్లు ఫోన్‌వచ్చింది అదేటైపులో హెచ్చరికలు.అవతల బిల్లీదాదా మద్యంమత్తులో జోగుతూ తిడుతూ రమ్మంటున్నాడు.

“రాణీ నాకు తలలో నరాలు తెగేలా ఉన్నాయి. వాడు నన్ను ఎవరనుకుంటున్నాడో ఏమో? ఎవడినో చంపేసి నేను రాకుంటే ఆశవం మనింట్లోకి విశిరిపోతాడంట.అంటే ఖూనీకోర్‌గా నన్ను కటకటాలవెనక్కి నెట్టిస్తాడు. ఇదెక్కడి గొడవ.నిజంగా బిల్లీదాదా పేరు ఇప్పుడే విన్నాను.నేను నామిఠాయి దుఖాణం తప్పితే ఇతరత్రా నాకేమితెలియదు” గోడకు చేరగిలబడిపోయాడు.

“అంతభయపడొద్దు. అలా నిలువుగుడ్లేయొద్దు. ఈదిక్కుమాలిన ఫోన్ మనకొద్దు. తీయించేద్దాం. ఫోన్ మోగిందంటే ప్రాణాలు రెపరెపలాడి పోతున్నాయి” చెప్పి కళ్లనీళు తిప్పుకుంది. సరిగ్గా 12గంటలయ్యింది. అప్పుడే నైట్ పోలీస్ పెట్రోలింగ్‌వ్యాన్ సైరన్ విన్పించింది. అనిల్‌కు ప్రాణాలు లేచి వచ్చాయి, వెంటనే తలుపులు తెరుచుకుని పరుగెత్తాడు. వ్యాన్ ఆపి పోలీసులకు తనఫోన్ గురించి చెప్పాడు. వెంటనే ఇన్‌స్పెక్టర్ వచ్చి ఫోన్‌నెంబర్ నోట్ చేసుకుని జరిగినదంతా విన్నాడు.వారిద్దరికి ధైర్యంచెప్పి ఓవర్‌బ్రిడ్జికి వెళ్లాడు. అక్కడ నిర్మానుష్యంగాఉంది. సైరన్‌ఆపి వ్యాన్‌ను పోనిచ్చాడు.అక్కడ నల్లఅంబాసడర్‌తో రోడ్డుకు అడ్డంగాపెట్టి మోటార్ సైకిల్‌ను ఆపి దానిమీద ఉన్నవాడిపై దాడిచేస్తున్న ఇద్దరిని పట్టుకున్నారు. అప్పటికే కత్తివేట్లు పడ్డాయి. తీవ్రంగా గాయపడినవాడిని హస్పిటల్‌లో ఎడ్మిట్‌చేశారు. పొడిచిన ఇద్దరిపెడరెక్కలు విరిచి గొలుసులు బిగించి సెల్‌లో పడేశారు.

మరుసటిరోజు అనిల్‌రాణిలను పోలీసులు కబురెట్టగా రాణాకు వెళ్లారు.సెల్‌లోంచి గుర్రుగా చూస్తున్న బిల్లీదాదా అనిల్‌ను చూసి పొరపడ్డానంటూ తల చువ్వలకేసి కొట్టుకున్నాడు.

ఇన్‌స్పెక్టర్‌కు విషయం మొత్తం తెలిసివచ్చింది.“మిస్టర్ అనిల్ నీవు నీవ్యాపారంలో ఆర్డర్లకోసం ఫోన్ పెట్టించావు. ఆఫోన్ ఒక యస్‌టిడిబూత్‌లో ఉండేది. అక్కడ్నించి రజాక్ అనే గూండా ఈబిల్లీదాదాతో ఇలాంటినేరాలు చేసేందుకు ఈఫోన్ వాడేవాడు. రజాక్ స్వంతఫోన్ లాంటిది.రెండురోజులక్రితం ఫోన్ సరెండర్ అయ్యింది. ఈలోగా ఫోన్ కావాలని డబ్బుకట్టావు. నీకు ఆనెంబర్ ఎలాట్‌చేసారు టెలిఫోన్ వారు.పాపం నీకు తొలికాలే ఈబిల్లీదాదానుంచి వచ్చింది. వారం రోజులుగా మరో గూండాను చంపడానికి బిల్లీదాదా పథకం వేస్తున్నాడు. రాత్రి పథకం అమలు చేయాలని దాదాతో బాటు మరో గూండా రజాక్ ఆహత్యలో పాల్గొనాలనుకున్నారు.అందుకే మద్యం మత్తులో తను ఏమిమాట్లాడాలో అదే చెప్పడం మీతో ఫోన్‌లో హెచ్చరికలు వరకు పోయాడు. రజాక్ హత్యచేయడానికి వెనకాడడమే కాకుండా దాదాకు దొరక్కుండా ఉన్నాడు. ఆకోపం దాదాను పిచ్చెక్కించింది. నీవు మాకు చెప్పకుంటే బ్రిడ్జివద్ద హత్య జరిగిపోయేది. తీవ్రగాయం అయ్యింది. అయితే ప్రస్తుతం కోలుకుంటున్నాడు.రజాక్‌ను పట్టుకున్నాం. వీరు చంపాలనుకున్న గూండా కూడా ఇప్పుడు నేరాలు మానుకున్నాడు. పాతపగతో చంపాలనుకున్నాడు బిల్లీదాదా” ఇన్‌స్పెక్టర్ నవ్వుతూ వివరించాడు. ★

సమ్మరింగ్ స్పెషల్

దినుసులు... ఊసులు...



మనం తినేవాటిల్లో లేదా వంటల్లో వాడే కొన్ని పదార్థాలను చూస్తే మనకే వింతగా అనిపిస్తుంది. వీటిలో చాలా వంట పదార్థాలు మనకు ఏ మాత్రం విశేషంగా అనిపించవు. బియ్యం, గోధుమల నుండి వంకాయ, పాలకూర వంటి వాటి వరకు ఏవీ విశేషాలుగా తోచవు. బహుశా వాటి వాడకం మనకంత 'మామూలై' పోయినందుకు కాబోలు. కానీ కొన్ని వున్నాయి. వాటిలో మనం పోషకపదార్థాలు వెదకం. ఆరోగ్య ఫలితాలను చూడం. ఎక్కువ మోతాదుల్లో తినం. అయినా వాటి వాడకం మానం! మరి వాటి ఊసులు చెప్పుకుందామా ఈవారం.

- డా॥ విజయ్







ఆవాలు, మెంతులు, మిరియాలు, యాలకులు, లవంగాలు, బిర్యానీ ఆకు, బిర్యానీ 'పువ్వు', వెల్లుల్లి, ధనియాలు, దాల్చిన చెక్క, కొత్తిమీర, కరివేప... ఇంకా ఎన్నున్నాయో! వీటిలో దేన్నైనా మీరు ఎక్కువ మోతాదులో తిన్నారేమో గుర్తుచేసుకోండి. సరే, వీటిలో ఏ ఒక్కటి లేకుండా మీ వంటకాలు ఏవైనా తయారయ్యాయేమో జ్ఞాపకం చేసుకోండి. అటువంటి జ్ఞాపకాలు అరుదుగా వుంటాయి కదూ!

ఆవాలు

అటువంటి అనేక దినుసులలో ఆవాలు ఒకటి. నల్లగా, గోధుమ రంగులో వుండే ఈ సన్నని గింజలు మన వంటకాల్లో సర్వసాధారణమైన పదార్థం. అయితే ప్రపంచవ్యాప్తంగా కూడా దీని వాడకం పరిపాటే. వంటకాలకి కొత్తరుచిని అద్దడానికే కాకుండా వాటిని నిల్వ వుంచడానికి కూడా ఆవాలు వాడతారు.

ఆవాలను క్రీ.శ. 800 సంవత్సరాల్లోనే ఫ్రెంచివాళ్ల వాడకం ప్రారంభించారు. అయితే క్రీస్తు పూర్వం ఆరవ శతాబ్దంలోనే తేలుకుట్టుకి విరుగుడుగా పైథాగరస్ వీటిని వాడినట్టు తెలుస్తోంది. హిపోక్రటీస్ కూడా అనేక ఔషధాలలో ఆవాలను వాడినట్టు ఆధారాలున్నాయి. రోమన్లు ఆవాల పొడిని ద్రాక్షరసంలో కలుపుకుని సేవించేవారు.

ఆవాలను ఆకలి పెంచడానికి వాడేవారు. ఆవాల వల్ల ఎనిమిదింతలెక్కువగా లాలాజలం వూరుతుందట. వీటి వల్ల జీర్ణప్రక్రియ, రక్తప్రసరణ మెరుగవ్వడమే కాక వీటిలోని గంధకం వలన చర్మ సమస్యలు కూడా తగ్గుతాయి.

ఇక ఆవాలనుండి తీసే నూనె ఎంత ప్రాముఖ్యమైందో ప్రత్యేకంగా వివరించనవసరం లేదు. మన ప్రాంతంలో ఆవపిండిని వాడి ఆవకాయ పట్టడం-ఆ విధంగా పదార్థాలను నిల్వ వుంచడం తెలిసిందే.

మెంతులు

పచ్చళ్ళలోనే వాడే మరో రకం గింజలు మెంతులు. భారత దేశంలో అధికంగా వాడబడే మెంతుల ఆనవాళ్లు క్రీస్తుపూర్వం 4000 సంవత్సరాల క్రితం నుండీ వున్నాయి. అయితే ఆ కాలంలో వాటి వాడకం ఎలా వుండేదో అంతగా తెలియదు. బహుశా మెంతి మొక్కల్ని పశువుల దాణాగా వాడేవారేమో! ఇప్పుడైతే మెంతి ఆకుల్ని మనమూ కూరల్లో తినేస్తున్నామనుకోండి.

ఈజిప్టులో మెంతులతో 'టీ' చేస్తారు. 'హెల్బా' అనే కేక్ తయారీలో మెంతులని వాడుతారు. ఈ కేక్ ముస్లింల ఆహారంలో ముఖ్యమైనది. యూదులు వీటితో 'సూపు' తయారు చేస్తారు. అనేక రకాల ఔషధాలలో మెంతులని వాడతారు. ముఖ్యంగా డయాబెటిస్‌కి ఇవి మంచి విరుగుడుగా ప్రాచుర్యం పొందాయి. పాలిచ్చే తల్లులకు, పాలు అధికంగా ఉత్పత్తి కావడానికి మెంతులు ఉపకరిస్తాయి. మెంతులను పెరుగులో కలిపి తింటే విరేచనాలు ఆగుతాయి.

మెంతులతో మరో ఉపయోగం వుంది. చేటలు పాతవైతే వాటిని గట్టిగా చేసి, వాటి రంధ్రాలను పూడ్చడానికి మెంతులను నానబెట్టి రుబ్బి, ఆ జిగట పదార్థాన్ని వాడతారు! అదే జిగట పదార్థాన్ని తలవెంట్రుకలను మృదువుగా చేయడానికీ వాడతారు!

యాలుకలు

సుగంధ దినుసులలో రాణి స్థానాన్ని ఆక్రమించేది యాలుకులే. ఒక ప్రత్యేకమైన సువాసన కలిగిన ఈ కాయలను మన స్వీట్లలో విస్తారంగా వాడతారు. విశేషమేమిటంటే- యాలుకులు అల్లం జాతికి చెందిన మొక్కలనుండి వస్తాయి. అవి ఆ మొక్క కాయలు. మనదేశంలోనే యాలుకులు అధికంగా పండుతాయి. ఈ కాయల్ని ఎండబెట్టి వాడతారు. అధికంగా గింజలు సుగంధాన్ని వెదజల్లుతాయి. అందుకని వాటిని నేరుగా తినడమే (నోరు శుభ్రపరుచుకోడానికి) కాకుండా కాఫీ, టీలలో నుండి స్వీట్లు, హాట్ల వరకూ వాడుతుంటారు. యాలుకుల్లో 'పచ్చ' యాలుకులు చాలా నాణ్యమైనవి, అందువల్ల ఔషధాలలో వాడతారు.

లవంగ

ఇప్పటి వరకూ మనం కొన్ని గింజల్నీ, కొన్ని కాయల్నీ సుగంధ/మసాలా దినుసులుగా తెలుసుకున్నాం. వాటన్నిటల్లో మరింత ప్రత్యేకమైన మరో పదార్థం వుంది. అది లవంగ మొగ్గ. అవును. లవంగ కాయా కాదూ, గింజా కాదు. మొగ్గే. ఇండోనేషియా, మనదేశాలలో పుట్టిన లవంగ క్రీస్తు పూర్వకాలంలోనే యూరప్, మధ్యప్రాశ్చ ప్రాంతాలకి పాకినట్టు తెలుస్తోంది.

ఈ ఘాటైన మొగ్గను కొన్ని వంటకాలలో రుచికంటే వాసన కోసమే ఎక్కువగా వినియోగిస్తారు. దీని నుండి తీసిన నూనె ఔషధంగా పనిచేస్తుంది. ప్రత్యేకంగా దంతవ్యాధులకు, పంటినొప్పికి లవంగ నూనె పరమౌషధం. అయితే మోతాదు మించితే లవంగనూనె/లవంగ మొగ్గ వికటించి, ప్రమాదం కొనితెస్తుంది.

యూరప్‌లో లవంగంతో చేసిన సిగరెట్లు వున్నాయి. జపాన్, చైనాలలో లవంగాన్ని అగరొత్తులు చేయడానికి వాడతారు.

మిరియాలు

దక్షిణ భారత దేశంలో విరివిగా పండించే మిరియాలను ఆ ప్రాంతపు వంటకాల్లో కూడా అధికంగా వాడతారు. మిరియాల చెట్టు తాలూకు కాయల్ని ఎండబెట్టి, మిరియాలుగా వాడతారు. చాలా వంట దినుసుల్లాగే మిరియాలు కూడా చరిత్రముందు నుండీ మనుషులకు పరిచయమే. మన దేశంలోకూడా చాలా ప్రాచీన కాలం నుండీ వీటిని వాడుతున్నారు. మన వంటకాలల్లో మిరియాల వాడకం దాదాపు 2000 సంవత్సరాల నుండీ వుంది. మన కేరళ తీరప్రాంతం మలబార్‌లో మిరియాల సాగు అధికం. పూర్వ కాలం మిరియపు 'గింజల్ని' నల్ల బంగారం అనేవాళ్లు- అంత విలువ వుండేది వాటికి. వ్యాపారంలో డబ్బులా కూడా ఈ మిరియాల్ని వాడేవారు.



మధ్యయుగాల తరువాత వరకు కూడా భారతదేశం నుండే యూరప్, ఆఫ్రికాలకు మిరియాలు తరలివెళ్లేవి. అసలు మిరియాల కోసమే అన్వేషిస్తూ ప్రాచ్యులు మన దేశాన్ని ఆక్రమించుకున్నారంటారు. మిరియాలు ఘాటు. వాటిని వంటల్లోనే కాక ఔషధాల్లో అనేక రుగ్మతలకు విరుగుడుగా వాడతారు. మిరియాల రసం, ఉల్లిపాయ ముక్కలపై మిరియాల పొడి వంటివి మనకు బాగా పరిచయమైన వాడకాలు. ఇంట్లో వండిన జున్నులో కూడా మిరియాల పొడిని వాడటం ఓ విశేషం. గొంతు నొప్పి, జలుబు వంటి చిన్న చిన్న సమస్యలకి వేడిపాలతో కలిపిన మిరియాల పొడి ఘాటైన జవాబు. ఇంత ఘాటుకు మనం ఎలా అలవాటు పడ్డామన్నదే అంతుపట్టని విషయం.



★

కథ



ఫలితం

- బుద్ధి యజ్ఞమూర్తి

రోడ్డుకి ఈ వైపు పోలీస్ స్టేషన్, ఆ వైపు పంచాయితీ అధీనంలోని పబ్లిక్ పార్కు... ఈ ఊళ్లో కనిపించే విచిత్రం. అందుకే వయసు మళ్లినవాళ్ల తప్ప వయసులో ఉన్న వాళ్ల ఆ పార్కులో కనిపించడం అరుదు. చుట్టుపక్కల ఇళ్లలోని పిల్లలు మాత్రం అక్కడున్న జారుడు బల్ల, ఉయ్యాల వద్ద ఆడుకుంటూ కనిపిస్తారు.

ఎప్పుడూ కూర్చునే సపోటా చెట్టుకింద పచ్చగడ్డిలో కూర్చుని, ఆడుకుంటున్న పిల్లల వంక చూస్తున్నాడు వివేకానంద. చూపు పిల్లల మీదున్నా మనసు మాత్రం ఇంకెక్కడో ఉంది. డిసెంబర్ నెల గాలి వొంటికి చల్లగా తగులుతోంది. చీకటి పడుతుండటంతో పార్కులో లైట్లు వెలిగాయి.

కణతలు నొక్కుకున్నాడు వివేకానంద. 'వాళ్లని ఎదుర్కోగలనా? పోరాడగలనా?' అనుకున్నాడు. 'ఆప్కో' లో వాలంటరీ రిటైర్మెంటు తీసుకుని ఊరికి వచ్చి రెండేళ్లయ్యింది. అప్పట్నించీ చూస్తున్నాడు, నేతగాళ్ల కష్టాల్ని. రోజురోజుకీ అవి పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే కుమ్మర్లు కుండల తయారీ వృత్తికి దూరమై ఇతర పనుల్లోకి వెళ్లిపోయారు. రేపు నేతగాళ్ళు కూడా నేతకి దూరమై పోనున్నారా? కూలీల ధరలు పెరుగుతుంటే, ఒక్క నేతగాళ్ల మజూరీలు మాత్రం అంతకంతకూ తగ్గుతుండటం. అదేమంటే నేసే గుడ్డకి డిమాండ్ తగ్గిందనే వాదన. నేత నేయడానికి అవసరమైన నూలు సహా అన్ని ముడి సరుకుల ధరలూ పెరుగుతూ నేతగాడికిచ్చే కూలీ మాత్రం తగ్గడం. ఎంత చిత్రం! ఎంత విషాదం!!

తెల్లవారుఝాము ఐదు గంటల నుంచి రాత్రి పదకొండు గంటల దాకా విరామ మెరుగకుండా మగ్గం ఆడుతున్నా నేతగాళ్ల బతుకులు అంతకంతకూ కునారిల్లి పోతుండటం కలచివేసింది వివేకానందని. ఆ పరిస్థితి మారాలని ఆయన కోరుకున్నాడు. ఎందుకంటే ఆయన పుట్టింది ఒక చేనేత కార్మిక కుటుంబంలోనే. రెక్కలు ముక్కలు చేసుకుని తల్లిదండ్రులు చదివించారు. కాబట్టి హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ చదివి ఆప్కోలో టెక్నీషియన్ ఉద్యోగం సంపాదించాడు. హైస్కూల్లో చదివేప్పుడు వీలు కుదిరినప్పుడల్లా ఆయనా ఒక చేత్తో పిడి, ఇంకో చేత్తో పలక పట్టుకుని నేత నేశాడు. తల్లిదండ్రుల కష్టం ఆయనకి బాగా తెలుసు. చచ్చేదాకా వాళ్లు సుఖపడింది లేదు. వివేకానంద చదువు పూర్తవుతుండగా తల్లి చనిపోయింది, సుగర్ వ్యాధి ముదిరిపోయి. ఆయన పెళ్లి చేసుకున్న నెలకి తండ్రికి కర్మకాండ చేశాడు. చేనేతకు కావలసిన వనరుల్ని సమకూర్చి, చేనేతతో పాటు, దాని అనుబంధ పనుల్ని కూడా ఒక చోట చేరిస్తే అన్న ఆలోచన వచ్చింది. ఆ ఆలోచనలోంచి పుట్టిందే వివేకానంద చేనేత సమితి స్థాపన. చేనేత మగ్గాల షెడ్లతో పాటుగా ఒక నూలు డైయింగ్ యూనిట్, ఒక పడుగుల శాల ఏర్పాటుచేసి, ఉత్పత్తి వ్యయంలో ఆదా చేయడమే కాక, నేతగాళ్ల కార్మికుల శ్రమకు తగ్గ ప్రతిఫలం అందించవచ్చని గుర్తించాడు వివేకానంద. దీని కోసం పదెకరాల స్థలం కావాలని ప్రభుత్వానికి అర్జీ పెట్టుకున్నాడు.

ఎవరైనా ఒక మంచి పని చేస్తుంటే, దాన్ని అడ్డుకునే దుష్ట శక్తులు చాలానే ఉంటాయి. సహజంగానే వివేకానంద చేస్తున్న పని ఆ ఊళ్లోని కొంతమంది షావుకార్లకి చెప్పలేనంత కోపం తెప్పించింది. ఊరి మొత్తంలోనే పెద్ద షావుకారైన సంజీవరావు అయితే కుతకుతా ఉడికిపోయాడు. నేతగాళ్లకి ఇప్పటిదాకా మజూరీలు ఎంత ఉండాలో నిర్ణయిస్తోంది. అతనే. అతనెంత చెబితే అంత. మిగతా షావుకార్లు కూడా దాన్ని పాటించాల్సిందే. ఆ ఊళ్లోనే కాక చుట్టుపక్కల ఊళ్ళలోనివి కూడా కలిపి అతని కింద ఐదు వందల మగ్గాలున్నాయి!

వివేకానంద చేస్తున్న పని వల్ల ఆ మగ్గాల్లో చాలావరకు తన చేజారి పోతాయని సంజీవరావు భయపడ్డాడు. తనకి సన్నిహితులైన షావుకార్లతో మీటింగు పెట్టి వివేకానంద చేస్తున్న పనిని ఎట్లాగైనా అడ్డుకోవాలనీ, ఎట్టి పరిస్థితుల్లోనూ మగ్గాల షెడ్లుల్ని ఏర్పాటు చేయనీయకూడదని నిర్ణయించాడు. వివేకానందకి కబురు చేశాడు. భయపడకుండా వెళ్లాడాయన... "ఇదిగో వివేకానందా! నువ్వు చేస్తున్న పని ఏం బాలేదు. నువ్వేమన్నా సంఘ సంస్కర్తననుకుంటున్నావా? మగ్గాల షెడ్లు పెట్టి మా నోట్లో మట్టి కొట్టాలనుకుంటున్నావా?" హెచ్చరించాడు సంజీవరావు.

"నేతగాళ్ల నోళ్లలో మట్టి కొడుతున్నది మీరు. లాభాలొచ్చినప్పుడు మొత్తం మీరే దండుకుంటున్నారు. నష్టాలొస్తే మాత్రం వాటిని మొత్తంగా నేతగాళ్లమీద రుద్ది కూలీ తగ్గిస్తున్నారు. మీరు నేతగాళ్లని బాగా చూసుకుంటే షెడ్లు పెట్టాలన్న ఆలోచన నాకు వచ్చేదే కాదు" దృఢంగా చెప్పాడు వివేకానంద.

"నేతగాళ్ల మీద పెట్టుబడి పెడుతున్నది మేం. నష్టాలొస్తే అసలు వాళ్లకి పనెట్లా ఇప్పించ గలుగుతాం. అయినా ఇదంతా అనవసరం. నువ్వు షెడ్ల ఆలోచన మానుకుంటే నీకూ, మాకూ మంచిది. లేదంటే తర్వాత జరిగేదానికి మేం బాధ్యులం కాదు" బెదిరింపుగా అన్నాడు సంజీవరావు.

"ఏంటి బెదిరిస్తున్నారా? ఏం చేస్తారు నన్ను. చంపుతారా? అంతకంటే మీరేం చేస్తారు?" వివేకానందలో మొండి ధైర్యం.

"నిన్ను చంపాల్సిన పని మాకేంటి? ఏ నేతగాడు నీషెడ్డుకొస్తాడో చూస్తాం. దాదాపు అందరు నేతగాళ్లూ మా షావుకార్ల కాడ అప్పులు తీసుకున్నోళ్లే. మా మాట కాదని వాళ్లు నీ దగ్గర కొస్తారనే అనుకుంటున్నావా?" మళ్లీ బెదిరించాడు సంజీవరావు.

అప్పటికి మౌనం వహించి వొచ్చేశాడు వివేకానంద. ఆయన పెట్టుకున్న అర్జీపై యాక్షన్ తీసుకోకుండా కాలయాపన చేయమని

ఎమ్మార్వోని మేనేజ్ చేశాడు సంజీవరావు. వెళ్లిన ప్రతిసారీ ఏదో సాకు చెప్పి పంపిస్తున్నాడు ఎమ్మార్వో. అతడు సంజీవరావుకి అమ్ముడుపోయాడని అర్థమైంది వివేకానందకి. తను నేతగాళ్ల జీవితాలు బాగు చేయాలనుకుంటే ఎన్ని అడ్డంకులు ఉన్నాయో అర్థమై మొదటిసారి కాస్త నిరాశపడ్డాడు. ఇన్ని కష్టాలు పడుతూ ఈ పని ఎందుకు చేయడం. అవసరమా? అనిపించింది కూడా. కానీ ఆకలి బాధలకూ, అప్పులకూ తట్టుకోలేక ఊపిర్లు వొదిలిన ఎంతోమంది నేతగాళ్ల కళ్లముందు మెదిలారు. తన పక్షం నిలుస్తూ. తన మీద ఆశలు పెట్టుకున్న నేతగాళ్ల మొహాలు దీనంగా కనిపించాయి. వాళ్లకోసం, వాళ్ల జీవితాలు బాగుపడ్డం కోసం అడ్డంకుల్ని ఎదుర్కోవాలనుకున్నాడు. అయితే ఎలా? ధన బలం, అంగ బలం ఉన్న సంజీవరావు బృందాన్ని ఎదిరించి ఎలా నిలవాలి?

పొయ్యేమంటూ వినవచ్చిన రైలుబండి కూతకి వివేకానంద ఆలోచనలు తెగాయి. ఆయన చూపు తనకి నాలుగైదు గజాల దూరంలో కూర్చున్న యువకుడి మీద పడింది. ఒక సిగరెట్ అయిపోవడంతో ఇంకో సిగరెట్ ముట్టించాడు. ఆ యువకుడు. అతను సిగరెట్ తాగేతీరు, మాటిమాటికీ పార్కు గేటు వైపు చూస్తున్న పద్ధతీ అతడేదో ఆందోళనలో ఉన్నట్లు తెలుస్తోంది. పది నిమిషాల్లో మూడు సిగరెట్లు తాగాడతను. ప్యాకెట్లోంచి ఇంకో సిగరెట్ తీశాడు. చూసి ఊరుకోలేక పోయాడు వివేకానంద.

"సిగరెట్లు అట్లా అదే పనిగా తాగితే ఆరోగ్యం పాడవుద్ది బాబూ" అన్నాడు ఆ యువకుడికి వినిపించేట్లుగా. అతను వివేకానంద వైపు విసుగ్గా చూసి సిగరెట్ ముట్టించాడు.

అతడి నిర్లక్ష్యం వివేకానందకు కాస్త కోపం తెప్పించింది. తమాయించుకున్నాడు. "పెద్దవాళ్లకంటే కుర్రాళ్లకి ఎంత నిర్లక్ష్యం, ఎంత చులకన?" అనుకున్నాడు.

"నువ్వేదో ఆందోళనలో ఉన్నట్లుంది. అందుకే అట్లా చైన్ స్మోకింగ్ చేస్తున్నావనుకుంటా. కరక్టేనా?" వదల్లేదు వివేకానంద. ఆ యువకుడు నోరు విప్పాడు.

"నా సంగతి మీకెందుకండీ. అసలే టెన్షన్‌తో చస్తుంటే" అన్నాడు కొంచెం చిరాగ్గా.

"నేను నీకు శత్రువుని కాదు బాబూ. చేతనైతే ఎవరికైనా సాయం చేయాలనుకుంటా. టెన్షన్‌తో ఉన్నావనే అడిగా"

ఆయువకుడు ఒకసారి వివేకానంద వొంక పరిశీలనగా చూశాడు. తేజోవంతమైన ఆయన మొహం, హుందాతనం ఉట్టిపడుతున్న ఆయన రూపం ఆ యువకునిలో గౌరవభావాన్ని కలిగించాయి.

"మీ సూచనకు థ్యాంక్స్. నా పేరు శశికుమార్. అయితే నా విషయంలో మీరు

చేయడలిగిందేమీ ఉంటుందనుకోను. ఎందుకంటే ఇది నా వ్యక్తిగత విషయం" అన్నాడతను.

వివేకానంద లేచి అతని దగ్గర కూర్చున్నాడు. "నువ్వు మాటిమాటికీ గేటువైపు చూస్తుంటే ఎవరికోసమో ఎదురు చూస్తున్నావనీ, వాచీ వైపు చూసుకుంటుంటే వాళ్లు చెప్పిన టైముకి రాలేదనీ అర్థమవుతోంది. నిజమేనా?" శశికుమార్ ఆశ్చర్యంగా చూశాడు ఆయన వొంక. 'నిజమే' అన్నట్లు తలాడించాడు.

"మనిషి చేష్టల్ని బట్టి అతని స్వభావాన్నీ, మానసిక స్థితినీ కొంతైనా అంచనా వేయగల సామర్థ్యం నాకుంది. వందలమంది మనుషుల్ని నా ఉద్యోగంలో భాగంగా దగ్గరగా చూడ్డం వల్లే నాకది అబ్బింది. నీ చేష్టల్నీ, మొహంలోని భావాల్నీ చదవబట్టే నువ్వు ఆందోళనలో ఉన్నట్లు అర్థమైంది. నీ ఆందోళన దేనికోసమో చెబితే నాకు తెలిసిన సలహా చెబుతా లేదా వీలైన సాయంచేస్తా" అన్నాడు వివేకానంద.

శశికుమార్ మరోసారి వాచీ వొంక చూసుకున్నాడు. తర్వాత ఎదురుగా ఉన్న పోలీస్ స్టేషన్ వొంక చూశాడు. "మీరట్లా మాట్లాడుతుంటే ఎవరో ఆత్మీయుడు మాట్లాడుతున్నట్లే మీకు నా సంగతి చెప్పాలని అనిపిస్తోంది" అని కొద్ది క్షణాలు ఆగి "పోలీస్ స్టేషన్లో పనుండి వొచ్చా" అని చెప్పాడు.

"ఏదైనా కంప్లయింట్ చేయడానికా? లేక ఎవరినైనా కలవడానికా?" అడిగాడు వివేకానంద కాస్త ఆసక్తిగా.

"లేదు పెళ్లి చేసుకోడానికి" ప్రశాంతంగా చెప్పాడు శశికుమార్. అదిరిపాటూ, ఆశ్చర్యమూ... రెండూ కలిగాయి వివేకానందకి.

"పెళ్లా?" అన్నాడు.

"ఆశ్చర్యంగా ఉంది కదూ. అవునండీ, నేను ఎదురు చూస్తోంది నా కాబోయే భార్య కోసం. మా ఇద్దరికీ పోలీస్ స్టేషన్లో పెళ్లి. మేం ప్రేమించుకున్నాం. మావి వేర్వేరు కులాలవడంతో మా పెద్దవాళ్లు ఒప్పుకోవడం లేదు. దాంతో పోలీసుల్ని ఆశ్రయించాం. వాళ్లు రావడం ఎందుకాలస్యమయ్యిందో, ఏమిటో?" చెప్పాడు శశికుమార్ గేటు వొంక పదేపదే చూస్తా.

తల్లిదండ్రులు ఒప్పుకోకపోయినా పోలీసుల సాయంతో పెళ్లి చేసుకోవాలన్న వాళ్ల ధైర్యానికి ముచ్చటపడ్డాడు వివేకానంద.

"ఆమె రాకపోతే ఏం చేస్తావ్?" అడిగాడు.

"లేదు. తప్పకుండా వొస్తుంది. నా మీద నాకంటే శ్యామల మీదే ఎక్కువ నమ్మకం నాకు. పెళ్లికి ఇంకొంత కాలం ఆగుదామని నేనంటే ఇప్పుడే చేసుకుందామని పట్టుపట్టింది తనే" చెప్పాడు శశికుమార్.

"అలా పట్టు పట్టిందంటే నీమీద తనకి నమ్మకం లేనందువల్లేమో" అని సందేహపడ్డాడు వివేకానంద. సర్రున కోపంగా చూశాడు శశికుమార్.

"ఏం మాట్లాడుతున్నారండీ. సలహా ఇస్తానంటూ ఇదా మీరు చెప్పేది? నా మీద నమ్మకం లేక కాదు. మా పెద్దవాళ్ల మీద నమ్మకం లేక. మమ్మల్నెక్కడ విడదీస్తారోననే భయంతో. ఇప్పుడు మేం పెళ్లి చేసుకుంటే రేపైనా మమ్మల్ని యాక్సెప్ట్ చేస్తారనే ఆశతో... ఇప్పుడు చేసుకుందామనేది తన ఆలోచన" గట్టిగా చెప్పాడు శశికుమార్.

"సారీ బాబూ! ఏమనుకోకు. ఆమె మీద నీ ప్రేమ ఏ రీతిలో ఉందో తెలుసుకుందామనే అలా అన్నా. సరే మీ పెళ్లి తర్వాత కూడా మీ పెద్దవాళ్లు మారకపోతేనో..." మళ్లీ మరో సందేహం వ్యక్తం చేశాడు వివేకానంద.

"నేను ఆశావాదిని. వాళ్లు మారతారనే అనుకుంటున్నా. మారకపోతే మా బతుకు మేం బతుకుతాం. మేం ఒకర్నొంచి ఒకరం ప్రేమని తప్ప మరేమీ ఆశించడం లేదు"

"ఆమె సంగతి ఏమోగానీ ప్రేమ మీదా, ఆమె మీదా నీకున్న నమ్మకం, నీ పట్టుదల నాకు నచ్చాయయ్యా. నేను తలపెట్టిన ఒక మంచిపనికి కావలసిన మానసిక బలాన్నిచ్చావు నువ్వు. నేను ముందుకు పోవడానికి ప్రేరణనిచ్చావు. సరే.. మీ పెళ్లికి నేనూ ఒక సాక్షినవుతా నీకు అభ్యంతరం లేకపోతే"

"తప్పకుండా సార్. మీలాంటి పెద్దవాళ్లు తోడుంటే అంతకంటే బలం మాకేముంటుంది. సంతోషంగా" అని.. "అరుగో వొచ్చేస్తున్నారు" అన్నాడు గేటువొంక మెరుస్తున్న కళ్లతో చూస్తా. ఒక యువతీ, ఇద్దరు యువకులూ వొస్తూ కనిపించారు వివేకానందకి. ఆయన రిలీఫ్‌గా ఊపిరి పీల్చుకున్నాడు.

ఆ మరుసటి రోజే కొంతమంది నేతగాళ్లను కలుపుకుని కలెక్టర్‌ని కలిశాడు వివేకానంద. మరో రెండు నెలలకల్లా పదెకరాల సువిశాల స్థలంలో మగ్గాలవాడ నిర్మాణపనులు మొదలయ్యాయి. ★

మానవీయ భావాల సుగంధం

భయం మేల్కొనే వుంది (కవితా సంపుటి)
రచయిత: డా॥ నాగినేని భాస్కరరావు
పేజీలు: 118,
వెల: రూ.90/-
పుస్తకాలు దొరుకుచోటు:
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

సుదీర్ఘకాలంగా వచన కవిత్వం రాస్తున్న సీనియర్ కవి డా॥ నాగినేని భాస్కరరావు తాజాగా 'భయం మేల్కొనే వుంది' కవితా సంపుటి ప్రచురించారు. ఇప్పటికి నాలుగు కవితా సంపుటాలతో పాటు పలు ఇతర పుస్తకాలు కూడా వీరు ప్రచురించారు. అయితే వీరి ప్రధాన రచనాధార వచన కవిత్వమే. అది కూడా వస్తు ప్రధానం. కవిత్వ నిర్మాణం పెద్దగా పట్టించుకోరు. భావచిత్రాలు, ప్రతీకలు, చిక్కదనం వంటి కవిత్వాంశాలు వీరికి ముఖ్యం కాదని వీరి కవిత్వం చదివిన పాఠకుడికి గ్రహింపుకొస్తుంది. సరళమైన పదాలతో వచన కవిత్వం విరివిగా రాసే వీరు అక్కడక్కడా ప్రాస కోసం ప్రయత్నం చేయడం కనిపిస్తుంటుంది. ఇవన్నీ కవిత్వ నిర్మాణ రీత్యా చూసినప్పుడు మనకు తట్టే అంశాలు. ఇక వస్తువు విషయంలో వీరు రాజీలేని శ్రామిక వర్గ పక్షపాతి. పర్యావరణం, వైద్యం, ఆకలి, సమసమాజం, మహిళలు, మానవ సంబంధాలు, పెట్టుబడిదారీ వ్యవస్థ దుష్ఫలితాలు వంటివి అనేకం వీరి కవితా వస్తువులు. ప్రతీ కవితా వీరి నిలువెత్తు నిజాయితీకి దర్పణంగా ఉంటుంది. వ్యవస్థను ఆవేశంగా ప్రశ్నించడం వీరి కవిత్వంలో ఉంటుంది. అదే స్థాయిలో సామాన్యప్రజలను మేల్కొమని చెప్పే హెచ్చరికలూ వ్యక్తం చేస్తారు. అతి చిన్న వచన కవితలు ఈ పుస్తకంలో ఉన్నాయి. దానికి భిన్నంగా అతిపెద్ద దీర్ఘకవితలు - వచన కవితా గల్పిక పేరుతో రాసినవీ ఉన్నాయి. తన రైలు ప్రయాణపు అనుభవాలను తెలుపుతూ సుదీర్ఘ వచన కవితా గల్పిక దీనిలో ఉంది. అది కథలాగా కొనసాగుతుంది. వీరి కవితలన్నీ కూడా వస్తుపరంగా అనేక అంశాలను ప్రస్తావన చేస్తాయి. కానీ కవిత్వ సౌందర్యం లేకపోవడం చేత పాఠకుడికి అంతగా ఆసక్తి కలుగదు. సమస్యను వట్టి వచనంలో అభివ్యక్తీకరిస్తే పాఠకుడి మనసులోకి ఇంకదు. కొన్ని కవితలు ప్రసిద్ధి చెందిన కవుల కవితలను అనుకరించినవి ఉన్నాయి. తిలక్ రాసిన 'నా అక్షరాలు వెన్నెల్లో ఆడుకునే ఆడపిల్లలు' అన్న కవితకు 'నా అక్షరాలు ఆపదలో ఆదుకునే ఆప్యాయతా కరాలు' (నా అక్షరాలు) అంటూ అనుకరిస్తూ ఈ కవిత సాగుతుంది. మరో కవిత 'కులాలనన్నీ కలాల దున్నీ' (రెడ్ సెల్యూట్) శ్రీశ్రీ 'హలాలనన్నీ పొలాలదున్నీ/ఇలాతలంలో హేమం పిండగ' అన్న కవితకు అనుకరణలా కనబడుతుంది. గొప్ప కవితల్ని అనుకరిస్తూ కొత్త వస్తువుతో భేషజం లేకుండా రాయడాన్ని అభినందించవచ్చు కానీ, పాఠకుడు అనుకరణ అని తేలికగా భావించే అవకాశం ఉంది. ముఖ్యంగా కవిత్వ పాఠకుడికి ఎప్పటికప్పుడు కొత్త శబ్దాలు, పదబంధాలు ఆసక్తిని కలిగిస్తాయి. కవి ప్రగతిశీల ఆలోచనా దృక్పథం మాత్రం ప్రతీకవితలో వికసిస్తూ కనిపిస్తుంది-- "వికసించిన నాగరికతలో-/ప్రసరించని సమాన ధర్మాన్ని-/సవిస్తరంగా సమస్త లోకానికి-/పంచాలంటే, ఉంచాలంటే-/సమన్వయం, చైతన్యంతో ఆపాలి అవస్థలు సృష్టించే ఈ కథని!" (కర్తవ్యం) చాలా వరకు కవితలు ఈ శైలిలో సాగుతూ ఉంటాయి. ఒకోసారి మంచి లయలో సాగుతాయి. కొన్ని మరీ వచనంలా మిగిలిపోతాయి.

మధ్యతరగతి జీవన స్థితిగతులను ప్రతిబింబించే కవితలు కూడా ఈ పుస్తకంలో ఎక్కువగానే ఉన్నాయి- "పెరిగిన అద్దెలు, ఆకాశంమీద నిత్యావసర వస్తువుల ధరలు-/పెరిగిన ఇంధన ధరలు, ప్లాట్ల ధరలు; ఇంటి స్థలం ధరలు, ఇంటి ధరలు-/మధ్య తరగతి మందహాసాన్ని త్రుంచేసాయి!/దిగువ తరగతి నమ్మకాన్ని వమ్ము చేసాయి!!" (పోరాటం బెటర్) అంటూ వర్తమాన దృశ్యాల్ని కవిత్వీకరించే ప్రయత్నం చేస్తారు. నేటి సమాజంలో తీవ్ర సమస్యలుగా ఉన్న వాటన్నింటి మీదా డా॥ నాగినేని భాస్కరరావు కవితా స్పందన కనపడుతుంది.

అసమానతల సమాజంలో ఎవరైనా సౌఖ్యవంతంగా ఉన్నామని అనుకుంటే అదే భ్రమ అని చెబుతూ "సకల సౌకర్యాల దుప్పటి కప్పుకున్నా/అనుభవాల రెప్పలు మూసుకున్నా/జీవితపు మెత్తని పరుపు మీద పడుకున్నా/సంతోషాల చెలి తోడున్నా-/నిద్ర రావటం లేదు-భయం మేల్కొనే వుంది"(భయం మేల్కొనే వుంది) అని కవిత్వీకరిస్తారు. మహాకవి శ్రీశ్రీ మీద అభిమానం చాటుకుంటూ రాసిన కవిత అలరిస్తుంది- "రెండు శ్రీల మనిషి/మెండుగ ఛందస్సును విడిచి/వేరొండుగ ఆకలి కేకల్ని/'మహాప్రస్థానం'గా మలచి/(సిరిసిరి మువ్వలు) అంటూ ఈ కవిత సాగుతుంది. కాలం గడిచే కొలదీ, మనిషి అభివృద్ధి సాధించడంతో పాటు మానవ సంస్కారాన్ని, మానవతా దృక్పధాన్ని పెంపొందించుకుంటూ సాగాలి. కానీ వర్తమాన సమాజం అభివృద్ధి పేరుతో వికృత విలువల్ని వ్యాప్తిచేస్తుందంటూ కవి నిరసిస్తాడు - "సంత్సరాలు గడుస్తున్న కొద్దీ/మనిషి సంస్కారాలు దిగజారుతున్న కాలం/జనాభా పెరుగుతున్న కొద్దీ/మనిషి మానసిక రుగ్మతలు పెరుగుతున్న కాలం-/ఈ కాలం అయిందాక హాలాహలం సగటు జీవికి" (కాలం) అంటారు. ఇలా అనేక అంశాలను 'భయం మేల్కొనే వుంది' సంపుటిలో కవి స్పృశించారు.

ఏమైనప్పటికీ సామాజిక దృష్టితో, అంకితభావంతో కవిత్వం రాస్తున్న డా॥ నాగినేని భాస్కరరావు అభినందనీయులు. కవిత్వ వస్తువునే కాకుండా కవిత్వ రూపం మీద కూడా దృష్టి పెడితే మరింతగా మానవీయ కవిత్వాన్ని పాఠకుడి మనసులోకి హత్తుకుపోయేలా రాయగలరు. ఆ కృషి చేస్తారని ఆశిద్దాం.

- వీరప్రసాద్

అందమైన పూదోట

పూల తోట అనగానే ఎవరికైనా ఆకుపచ్చని చెట్లు, అందమైన పుష్పాలు స్ఫురిస్తాయి. ప్రత్యక్షంగా కాని, చిత్రాలలో కాని వాటిని చూడగానే ఒక అపురూపమైన అనుభూతి కలుగుతుంది. కాని అసలు చెట్లు, పూలు లేకుండానే అలాంటి అందమైన అనుభూతిని తన నైరూప్య చిత్రాల ద్వారా కల్గిస్తున్నాడు ఒరిస్సాకు చెందిన ప్రబీర్ కుమార్ దలై. సాధారణంగా ఒరిస్సాలో ఆ మాట కొస్తే మన రాష్ట్రంలో సైతం సంప్రదాయ చిత్రాలను వేసే చిత్రకారులే ఎక్కువ. నైరూప్య చిత్రాలను గీసే వారు బహు అరుదు. నైరూప్య చిత్రాలలో రేఖలు, రేఖాకృతులు ప్రధానంగా తీసుకుంటారు. వాటి ద్వారానే తమ భావాలను వ్యక్తం చేస్తుంటారు. కాని గీతలు, ఆకృతులను మించి వర్ణాలు ప్రధానంగా ఉండే నైరూప్య చిత్రాలు ఇంకా తక్కువ. అలాంటి విశిష్ట చిత్రాలను హైదరాబాద్లు, ఐకానో ఆర్ట్ గ్యాలరీలో 2009 అగస్టు 5 నుండి 20 వరకు ప్రదర్శిస్తున్నారు. ఒక ఫైనార్ట్స్ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తున్న దలై చిత్రాలలో అనుకరణల జాడ్యం అసలు అంటని తాజాదనం ప్రేక్షకులను ముగ్ధులను చేస్తుంది. ప్రదర్శనకుంచిన దాదాపు పాతిక చిత్రాలలో ఇవి మచ్చుకు మాత్రమే.

- జి.వి

అలీబాబా 40 దొంగలు

జరిగినకథ:

కట్టెల కోసం అడవికి వెళ్లినప్పుడు దొంగల ముఠా గుహ చూస్తాడు అలీబాబా. అందులోంచి బోలెడంత బంగారం, డబ్బు మూటకట్టి తెచ్చుకుంటాడు. అయితే ఈ విషయాన్ని అతని వదిన కనిపెడుతుంది. భర్తను కూడా అక్కడికి వెళ్లి డబ్బు తెమ్మని పోరుతుంది. అలా వెళ్లిన అలీబాబా అన్న దొంగల చేతిలో ప్రాణాలు కోల్పోతాడు. అయితే రెండు భాగాలుగా విడిపోయిన అన్న శవాన్ని అతికించేందుకు ఓ దర్జీని తీసుకొస్తాడు. అతని ద్వారానే దొంగలముఠాలో ఒకడు అలీబాబా ఇంటిని గుర్తుపడతాడు. ఆ తర్వాత...

అలీబాబా ఇంటిని కనిపెట్టిన దొంగ శరవేగంగా వెళ్లి తమ నాయకుడికి విషయం చెప్తాడు. దాంతో నాయకుడు పెద్దగా నవ్వి...సంతోషంగా..."శిష్యా! భలే పని చేశావ్. పద వెంటనే వాడిని కూడా హతమారుద్దాం. అప్పుడుగానీ మన పగ చల్లారదు" అని గుర్రాల మీద బయలుదేరతారు.

తీరా అక్కడికి వెళ్లాక చూస్తే ఏముంది! గ్రామంలోని అన్ని ఇళ్లమీద ఆ గుర్తు కనిపిస్తుంది. దాంతో అందరూ సామాన్యుడి వేషంలో వున్న దొంగ వైపు చూస్తారు తీక్షణంగా...దానికి అతను

"దర్జీవాడు చూపించిన ఇంటికి మాత్రమే నేను గుర్తుపెట్టాను నాయకా. ఇప్పుడు చూస్తే అన్ని ఇళ్లకు ఆ గుర్తు వచ్చింది. అదెలా జరిగిందో నాకు తెలీదు" అంటూ దాదాపు ఏడ్చినంత పని చేస్తాడు.

దాంతో నాయకుడికి విపరీతమైన కోపం వస్తుంది. తన కత్తి తీసుకొని అతని గుండెల్లో దించేస్తాడు. పైగా అందరివైపు చూస్తూ....

"అప్పగించిన పని విషయంలో ఏదైనా తేడా చేస్తే శిక్ష ఇంతే తీవ్రంగా వుంటుంది. ఇందుకు ఎవరైనా సిద్ధంగా వుండండి సుమీ! మరి ఇప్పుడు ఎవరు వెళతారు వాడ్ని పట్టుకోడానికి?" అంటాడు.

అంతలో ఒక దొంగ చెయ్యి పైకెత్తి..."నేను వెళతాను నాయకా! నా సత్తా ఏంటో చూపిస్తాను. వాడిలా తెలివితక్కువగా చేయను. ఈసారి వాడ్ని పట్టి నీకాళ్లముందు పడేస్తాను" అంటాడు మీసం తిప్పుకుంటూ.

"ఇది ఇలా వుండాలి శిష్యుడంటే...సరే వెళ్లు..." అని అతడ్ని పంపిస్తాడు.

అతడు నేరుగా దర్జీ ఇంటికి వెళతాడు. దర్జీ కళ్లకు గంతలు కట్టి ముగ్గు నింపిన చిల్లు సంచిని అతని నడుముకు వేళ్లాడదీస్తాడు. దర్జీ నేరుగా అలీబాబా ఇంటికి తీసుకెళతాడు. అక్కడ ఆగి

"ఇదే అతని ఇల్లు. ఇక నా కట్లు విప్పు" అంటాడు. దర్జీ వెళ్లిపోయాక ముగ్గు గీతను తనివితీరా చూసుకుని తిరిగి నాయకుని దగ్గరకు వెళతాడు దొంగ.

ఇదంతా అలీబాబా భార్య గమనించి... ఇది కూడా దొంగల పనేననుకుంటుంది. మళ్లీ ముగ్గు బుట్ట తీసుకొని అన్ని ఇళ్లకు వెళ్లే దారులకు ముగ్గు గీత గీస్తుంది.

శిష్యుడు చెప్పిన మాట విని సంతోషంగా అనుచరగణంతో బయలుదేరి వస్తాడు దొంగలనాయకుడు. అయితే వచ్చీరాగానే అతనికి అన్ని ఇళ్లకు ముగ్గు దారులు కనిపించి ఉగ్రుడౌతాడు. మొదటివాడికి పట్టిన గతే ఇతనికీ పట్టిస్తాడు. ఇలా అయితే ముఠా సభ్యులు తగ్గిపోతారని భావిస్తారు అందరూ. అందుకే కోపం తగ్గించుకొని ఆలోచనతో ముందుకు సాగాలనుకుంటారు. వారందరిలోకి ఓ వృద్ధ దొంగ లేచి

"మీరు ఆవేశపడకండి. దాని మూలంగా ఇద్దరిని కోల్పోయాం. నష్టం మనకే వాటిల్లుతోందిగానీ వాడు బాగానే వున్నాడు. అందుకే బుద్ధి బలం ఉపయోగించాలి. ఇప్పటి వరకు జరిగిన దాన్ని బట్టి చూస్తే మన బంగారం దోచుకెళ్లినవాడు అదే వీధిలో వున్నాడని తెలుస్తోంది. అక్కడికే వెళ్లి విషయం ఆరాతీస్తే సరి" అంటాడు.

అంతా విన్న నాయకుడు సాలోచనగా తల ఊపి...

"అయితే ఇక లాభంలేదు. నేనే రంగంలోకి దిగుతాను" అంటూ వేషం మార్చుకుని బయలుదేరతాడు. ఏకంగా వెళ్లి అలీబాబా ఇంటి అరుగుమీద కూర్చుని ...దాహం ఇమ్మని అడుగుతాడు. అయితే అతనే అలీబాబా అని దొంగకు తెలీదు. కానీ లోపల కాశిం పటం కనిపిస్తుంది. అది చూసి దొంగ గుర్తుపడతాడు. అది ఎవరిదని అడుగుతాడు అలీబాబాని. అది తన అన్నదని నయం కాని జబ్బుతో పోయాడని చెప్తాడు అలీబాబా. దొంగల నాయకుడికి విషయం అర్థమౌతుంది.తమ బంగారాన్ని దోచుకుంది ఇతనేనని పోల్చుకుంటాడు. వెంటనే

"అయ్యా నేనొక నూనె వ్యాపారిని. దూరం నుంచి వస్తున్నాను. మీరు అనుమతిస్తే నూనె నింపిన తోలు సంచులు మీ ఇంట్లో కొంత కాలం వుంచుకుంటాను" అంటాడు వినయంగా. అందుకు అలీబాబా అంగీకరిస్తాడు. చీకటి పడేసరికి దొంగల నాయకుడు తోలు నూనె సంచులతో సిద్ధమౌతాడు. అందులో ముఠా సభ్యులను కూర్చోబెట్టి తీసుకొస్తాడు. అదను చూసుకొని బయటకు వచ్చి అలీబాబాని చంపేయాలనేది వారి పథకం.

అతను భోజనం చేస్తుండగా అలీబాబా భార్య అనుమానంగా తోలు సంచుల దగ్గరకు వచ్చి చేత్తో ఒకదాన్ని తడుతుంది. అప్పడు లోపలినుంచి "వచ్చేయమంటావా నాయకా" అన్న మాటలు వినిపిస్తాయి. అయితే ఇదంతా దొంగలముఠా పనేననుకున్న ఆమె ఓ ఉపాయం ఆలోచిస్తుంది...

(ఆ తర్వాత ఏమైంది. దొంగల ముఠా ఆట ఎలా కట్టించారు? అన్న విషయాలు తెలియాలంటే మరో ఏడురోజులు ఆగాల్సిందే)

పునఃకథనం: కె. చరిత